# చైతన్యం


సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక

డిసెంబరు 2021

రు. 20/-




బంగ్లాదేశ్ విమోచన 50 సంవత్సరాల
ఉత్సవాలలో ఢాకాలో
ప్రసంగిస్తున్న రాష్ట్రపతి


1971లో పాక్ సేనల లొంగుబాటు -
చారిత్రాత్మక విజయం




చైతన్యం సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

డిసెంబరు 2021



వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి



సంపుటి -11 సంచిక - 3


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| వర్ధమాన రాజ్యం | 6 |
| ఊరొదిలి ఉద్యోగం | 8 |
| వేదులాన్వయు పలుకు | 14 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 15 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 18 |
| సప్త మోక్ష నగరాలు | 24 |
| 116 కందాల్లో సుందరకాండ | 29 |
| ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ | 32 |
| చిత్తము వసంతీకరించిన సీతారామశాస్త్రి | 39 |
| సేవా? సహాయమా! | 41 |
| ప్రేమంటే ఇంతే | 44 |
| మా ఊరి నందుల కథ | 46 |
| శ్రీ వచన భూషణం | 48 |
| అనుపానం | 49 |
| కార్టూన్-సరసి | 50 |


ముఖచిత్రం : కాశీ విశ్వనాథునికి హారతి నిస్తున్న ప్రధాని


రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## పద్మశ్రీ సిరివెన్నెల కలం అనంత లోకాలకు ...

తెలుగు భాషలోని 56 అక్షరాలను అచ్చులు హల్లులతో సహా తీసుకుని , మైనపు ముద్దగా చేసి, ఆ ముద్దను మస్తిష్కంలోకి పంపి, మదిలో కోటి భావాలు మెదులుతుంటే తనకి వీలుగా సమాజానికి ఉపయోగకరంగా ,ఆనందం కలిగిచేటట్టుగా ఆ మైనపు ముద్దను పదాలుగా చేసి, 3000ల పాటలకు పైగా మన ముందుంచిన గొప్ప రచయిత సిరివెన్నెల. నిజం మాట్లాడుకోవాలంటే పాటకి రచయిత పేరు బైటకి పెద్దగా వచ్చేది కాదు చాల కాలం క్రితం వరకు. సినిమాలలో act చేసిన వారు, పాడిన వారి పేరు మాత్రమే తెలిసేది. ఎందుకు రచయిత పేరు బైటకి రాదు అని, ఈ విషయం లో ఎప్పుడూ బాధ పడేదాన్ని. ఇప్పుడు రచయితలకు కూడా అంత ప్రాధాన్యత నివ్వడం ఆనందంగా ఉంది. జగమంతా ఒక కుటుంబంగా ఒకటిగా బ్రతకండి అని భగవంతుడు 84 లక్షల జీవరాసులలో మనల్ని అందులో భాగంగా సృష్టించాడు . మానవులకు జ్ఞానాన్ని అధికంగా ఇచ్చాడు. ఇక్కడ మానవుడు మాత్రం అజ్ఞానంతో తప్పుడు మార్గంలో జీవిస్తూ, తనతో పాటు సమానంగా జన్మనెత్తిన వారి కన్నా తానే గొప్ప అని భావించి, ఎప్పటికీ అంతా నాది నా కుటుంబానిదే అనుకుంటూ స్వార్ధంగా తన జీవనాన్ని సాగించడం మానవ జాతికే అవమానం. అంతే కాదు సృష్టిలో అతి ముఖ్యమైన మిగిలిన వాటిని కూడా తమ అహంకారంతో నాశనం చేస్తున్నారు. ఏది మన చేతిలో ఉంది? పుట్టుక , చావులతో సహా ఏదీ మన చేతిలో లేదని తెలియదా? అందరికీ తెలుసు. పుట్టుక చావుల మధ్య నున్న జీవితం హాయిగా జగమంతా కుటుంబంగా (సిరి వెన్నెల చెప్పినట్లు) ప్రతీ క్షణం ఆనందించండి, అనుభవించండి తమ తెలివి తేటల్ని, తమ ఈ శరీరాన్ని వృధా కాకుండా తమకి తామే కాక, కుటుంబానికి, సమాజానికి కూడా ఉపయోగించండి. ఉన్న సమయం కాస్తా విమర్శలకు, హింసలకు. దురాక్రమణ కి తావివ్వకుండా ఈ అశాశ్వతమైన జీవితాన్ని వృధా చేసుకోవద్దు మనం .

సీతా రామ శాస్త్రి గారి లాంటి వారు మనల్ని వీడి వెళ్లి పోయారు. ఆయన తన జీవితాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కానీ ఆయన ఆరోగ్యం బావుంటే వారి కుటుంబమే కాక , మనం అందరం కూడా వారి అండను, ఎంతో జ్ఞాన సంపదను వారి నుండి కోల్పోయేవారం కాదు కదా! అంటే ఎవరి ఆరోగ్యాన్ని వారు చేతనయినంత వరకు కాపాడుకోవడం వల్ల వారికే కాక , కుటుంబానికి సమాజానికి కూడా చాలా ఉపయోగం కదా!

సిరివెన్నెల సీతా రామ శాస్త్రి కుటుంబం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, మీడియాకు ,సినీ కుటుంబానికి ఎంతో ప్రేమను మాకు పంచాయి కష్ట సమయంలో. నాన్నగారిపై ఎంతో గౌరవాన్ని చూపించారు. అలాగే మీ ప్రేమను ఎప్పటికీ మరచిపోలేము అంటూ ఆయన కుమారుడు యోగీశ్వర శర్మ ట్వీట్ చేశారు.

## 9 రోజుల్లో 30 దేశాలకు పాకిన వైరస్

ప్రజలంతా కరోనా తగ్గింది అని రక రకాల ఫంక్షన్ లు, వివాహ వేడుకలు వంటివి కూడా చేసుకుంటూ, కరోనా నుండి కొంత వరకూ బయట పడ్డామనుకుంటున్న తరుణంలో దక్షిణాఫ్రికా నుండి కొత్త వేరియంట్ 'ఒమిక్రాన్' వెలుగు చూపడంతో ప్రజలందరిలో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ వైరస్ క్రమంగా ప్రపంచ దేశాలకు విస్తరిస్తుండడమే . . ఒమిక్రాన్ వేరియంట్ దావానలంలా వ్యాపిస్తుండడంతో ప్రపంచం మళ్ళీ భయం గుప్పిట్లోకి వెడుతోంది. రోజుల వ్యవధిలోనే ఈ కొత్త వేరియంట్ సుమారు 30 దేశాలకు పాకింది. డెల్టా రకం కన్నా 6 రెట్లు వేగంతో వ్యాప్తి చెందే లక్షణం కలిగిన ఈ ఆందోళనకర వేరియంట్ మన దేశంలో కూడా వెలుగు చూడడంతో ప్రజల్లో ఆందోళన మొదలయ్యింది. విదేశాల నుండి కర్ణాటకకు వచ్చిన ఇద్దరు మగవారిలో ఒమిక్రాన్ వెలుగు చూసినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. తీవ్రమైన లక్షణాలేవీ లేవు అయినా అందరు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. విదేశాల నుండి వచ్చే ప్రయాణీకులకు టెస్ట్ చేయగా కరోనా కొందరికి ఉంటున్నట్లు తేలుతోంది. ఈ వైరస్ యువతకే ఎక్కువగా సోకుతోంది. వారికి రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండడంతో వారికి తీవ్రమైన సమస్యలు కొన్ని వారాల వరకు రాక పోవడం వల్ల వెంటనే తీవ్రత తెలియడం లేదు అని దక్షిణాఫ్రికా శాస్త్ర వేత్తలు తెలిపారు. ఇప్పుడు ఈ వైరస్ పెద్ద వారికి సోకుతుండడం కూడా గమనించాము అంటూ ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఒమిక్రాన్ తీవ్రతను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్న శాస్త్రవేత్తలు ఇంకో కొత్త విషయాన్ని కనుక్కున్నారు. మ్యూటేషన్ ప్రొఫైల్ వరస స్వరూపాన్ని

పరిశీలించగా ... ఒమిక్రాన్ సోకిన వ్యక్తుల్లో రోగ నిరోధక శక్తి తగ్గుతున్నట్లు తేలింది కానీ వ్యాక్సిన్ తీసుకున్న వారికి కోవిడ్ నుండి రక్షణ లభిస్తుందని అందరూ తక్షణమే వ్యాక్సిన్ తీసుకోవాలని మందు పని చేయడానికి 2 నుండి 4 వారాల సమయం తీసుకుంటుందని వైద్యులు చెబుతున్నారు. అంతే కాదు ప్రజలంతా మాస్క్ వేసుకు తీరాలని వైద్యులు చెబుతున్నారు, తెలంగాణా ప్రభుత్వం అయితే మాస్క్ వేసుకోని వారు 1000 రూపాయలు జరిమానా కట్టాలని నిబంధన పెట్టింది.

రాష్ట్రంలోకి ఒమిక్రాన్

దేశాల్లో వేగంగా విస్తరిస్తున్న ఒమిక్రాన్ రాష్ట్రంలోకి ప్రవేశించింది. హైదరాబాదు కు వచ్చిన ఇద్దరు విదేశీయుల్లో ఈ వేరియంట్ గుర్తించినట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి. శ్రీనివాసరావు తెలిపారు. ఓమిక్రాన్ వేగంగా వ్యాప్తి చెందుతున్న 10 దేశాలనుంచి వచ్చే ప్రయాణీకులకు ఖచ్చితంగా విమానాశ్రయంలో కోవిడ్ పరీక్షలు నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. మిగిలిన దేశాలనుండి వచ్చే ప్రయాణీకులకు ర్యాండం గా 2శాతం మందికే కరోనా పరీక్షలు చేస్తున్నారు.

కాశీ మందిర పరిసరాల సుందరీకరణ ప్రథమ దశ ప్రారంభించిన ప్రధాని మోదీ

వారణాసి నుంచి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన నరేంద్ర మోదీ, కాశీ విశ్వనాథ్ మందిర పరిసరాల సుందరీకరణకు 2019 సంవత్సరంలో శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్ మొదటి దశ పనులు పూర్తవటంతో, డిసెంబర్ 13 వ తారీఖున ప్రధాని వారణాసి విచ్చేసి, గంగానదిలో స్నానము చేసి, కాశీ విశ్వనాథునికి అభిషేకం చేసి, 'టెంపుల్ కారిడార్' ను ప్రారంభించారు. దీనివల్ల భక్తులు గంగా ఘాట్ లో స్నానం చేసి, ఇంతకూ ముందులా ఇరుకు సందుల లోంచి కాకుండా, నేరుగా విశాలమైన కారిడార్ ద్వారా విశ్వనాథ్ మందిరం చేరుకొని దర్శనం చేసుకోవచ్చు. ఈ ప్రాజెక్ట్ పనులలో భాగంగా గుడి చుట్టూ ఉన్న 400 భవనాలు, ఇళ్ళు, దుకాణాలు తొలగించటం జరిగింది. ఇలా తొలగిస్తున్నపుడు దాదాపు 40 పురాతన గుడులు బయటపడటం విశేషం. ఆ గుడులలోని విగ్రహాలు మొదలైనవి రాబోయే దశలో నిర్మించబోయే మ్యూజియం లో భద్రపరుస్తారు. ఈ సుందరీకరణ పట్ల దేశ ప్రజలు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అత్యంత ఆరాధనీయ వ్యక్తుల జాబితాలో 8వ స్థానంలో మోదీ

ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఆరాధనీయ వ్యక్తిగా నరేంద్ర మోడీ 8వ స్థానంలో ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ . రష్యా అధ్యక్షుడు పుతిన్ ల కంటే ముందున్నారు. అంతర్జాతీయంగా నిర్వహించిన ఈ సర్వేలో ... అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా మొదటి స్థానంలో నిలిచారు, రెండో ఏడాది కూడా ఈ స్థానాన్ని ఆయనే దక్కించుకున్నారు. కాగా మన ప్రధాని 8వ స్థానాన్ని దక్కించుకున్నారు.

ఓటరు కార్డుతో ఆధార్ కార్డుకు లింక్ చేస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర ఎన్నికల సంఘం చేసిన సిఫారసు మేరకు పలు సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది . ఓటర్ల జాబితాను బలోపేతం చేయడం, ఓటింగ్ ప్రక్రియను మరింత మెరుగు పరచడం, ఈసీకి మరిన్ని అధికారాలు కల్పించామే కాక బోగస్ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా పలు ప్రతి పాదనలతో కూడిన బిల్లును ఆమోదించింది. పాన్ -- ఆధార్ లింక్ చేసినట్లుగానే, ఓటర్ ఐడీ లేదా ఎలక్టోరల్ కార్డుతో ఆధార్ నంబర్ను అనుసంధానం చేయనున్నారు. జనవరి 1వ తేదీకి 18 ఏళ్ళు దాటితేనే ఓటరుగా నమోదుకు అనుమతిస్తారు.

మాస్క్ వేసుకోకండా బయటకి వెళ్ళకండి. మీ ఆరోగ్యమే కాక మీతో ఉన్న వారి ఆరోగ్యం కూడా కాపాడిన వారవుతారు . మనలో చైతన్యం రావాలి . అందరం ఆరోగ్యానికి ప్రాధాన్యత నివ్వాలి.

సర్వేజనా సుఖినోభవంతు.



తీగవరపు శాంతి

# వర్ధమాన రాజ్యం



భువనచంద్ర

వర్ధమాన రాజ్య ప్రజలు ఉర్రూతలూగిపోతున్నారు. కారణం, కొన్ని దశాబ్దాల పాటు పోరాటం సాగించి, ఎట్టకేలకు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవడమే.

అప్పటిదాకా వర్ధమాన రాజ్యాన్ని ఇష్టం వచ్చినట్లు పరిపాలించి, ప్రజల్ని పన్నులతో పీల్చి పిప్పిచేసిన రాజ్యాధినేతలు, మావలాయనుడు అనే మహా విజ్ఞాని పెట్టిన మహా ముహూర్తాన వర్ధమాన రాజ్యాన్ని నాగరికుడనే వర్ధమాన మహానాయకుడి చేతికి వొప్పగించి తమ ఓడలు తాము ఎక్కి వెళ్లిపోయారు.

"అయ్యా... వర్ధమాన దేశం పాడి యావు లాంటిది. తొందరపడి ముందే మనం స్వతంత్ర్యం ఇచ్చేశామేమో" అన్నాడు రిచ్చుట రాజ్య రాయబారి శ్వేత వాలుడు రిచ్చుటుడితో.

"పిచ్చివాడా, వాళ్ళని మనం వొదిలిపెట్టినా, మనని వాళ్ళు వదలరు. రాజ్యాన్ని బదిలీ చేసినప్పుడు వచ్చిన వర్ధమానుల్లో ఎంతమంది వారి దేశీయ దుస్తులు వేసుకున్నారూ? ఓ శ్వేతవాలా, మన భేషజం వీళ్ళు తలల నిండా ఎక్కించుకున్నారు. వచ్చినా రాకపోయినా మన భాషనీ, యాసనీ అనుకరించడం వీళ్ళ శ్వాసగా మారింది. వీళ్ళే కాదు, వీళ్ళు వీరి పిల్లల్నీ, ఆ పిల్లల పిల్లల పిల్లల్నీ కూడా మన భాషకి బానిసలుగా చేస్తారు. తోట ఎక్కడనుంటేనేం... కాసే ప్రతి కాయా, పండూ మనవి అయినప్పుడు!" చిద్విలాసంగా నవ్వాడు రిచ్చుట మహారాజు.

"అబ్బ.... ఎంత చక్కని నిజాన్ని చెప్పారూ ....! మీ తెలివంటే ..." మెచ్చుకున్నాడు శ్వేతవాలుడు.

"పిచ్చివాడా... నిజం ఏమిటో తెలుసా? యీ వర్ధమాన మహాదేశాన్ని మనం గెలవలేదు. గెలవడానికి వీరి జనాభా ఎంత, మనదెంత? ఎక్కడినించో ఇక్కడికి వచ్చి వీళ్ళని గెలవడం సృష్టిలో ఎవరికైనా సాధ్యమా? నిజం ఏమిటంటే మనం వీళ్ళతో ఎదురు బదురు యుద్ధం చెయ్యలేదు. మనం చేసింది మేధా యుద్ధం" నవ్వి అన్నాడు రిచ్చుటుడు.

"అంటే?" అడిగాడు శ్వేతవాలుడు.

"వీళ్ళల్లో వీళ్ళే కొట్టుకునేటట్టు చేసాం. మనం హాయిగా చోద్యం చూస్తూ, వాళ్ళంతట వాళ్ళే మన కాళ్ళమీద పడేట్టు పథకాలు రచించాం. వాళ్ళని వీళ్ళు, వీళ్ళని వాళ్ళూ గెలవాలని తొందరపడ్డారే గానీ, ఆ క్రమంలో తమ దేశాన్నే మనకి ధారపోస్తున్నామని వీళ్ళు గుర్తించలేకపోయారు.

వాళ్ళ రాజా, మహారాజా పదవుల్ని ఆనందంగా మర్చిపోయి మనం విసిరే కుక్క బిస్కెట్ల లాంటి పిచ్చిపదాల మోజులో పడ్డారు. వాళ్ళ ధనాన్నీ ప్రాణాల్నీ మానాన్నే కాక వాళ్ళ ప్రజల్ని కూడా మనకి దాసానుదాసుల్ని చేశారు. ఇప్పుడు అర్థమయిందా? గెలుపోటములు నిగ్గుతేల్చేది ఏనాడూ ఆయుధాలు కావు. మానవుడి మేధస్సే ఎంత కుటిలమయితే, అన్ని అసాధ్యాల్ని సుసాధ్యం చేస్తుంది" పైపు వెలిగించి నౌకమీద విశ్రాంతిగా కూర్చున్నాడు రిచ్చుటుడు.

*****

స్వతంత్ర వర్ధమానం దేశం ఆనందంగా సమావేశమయింది. మారుమూలలనుంచి కూడా ప్రతినిధులు వచ్చారు.

"ఎన్నికలని నిర్వహించే ముందు మన చట్టాల్ని రూపొందించుకోవాలి" అన్నాడు పెద్దాయన.

"అందులో సమస్య ఏముందీ!" నవ్వాడు చిన్నాయన.

"అంటే?" సీరియస్ గా అడిగాడు పెద్దాయన.

"అయ్యా, గత రెండు వందల సంవత్సరాలుగా మన వాళ్లకి అలవాటైంది రిచ్చుట చట్టాలూ, సంస్కరణలే. ఇప్పుడు మనం కొత్తవి రూపొందిస్తే బోలెడంత సమయమూ, డబ్బూ ఖర్చు అవడమే గాక ప్రజలు కన్ఫ్యూజ్ అయిపోతారు. కనుక యథాతథంగా అవే చట్టాల్ని కొనసాగించడం మంచిది" వివరించాడు చిన్నాయన.

"అప్పుడు మనం చేసిన పోరాటానికి అర్థం ఏవుందీ?" తీవ్రంగా ప్రశ్నించాడో స్వేచ్ఛా ప్రియుడు.

"పాలకులు అంటే పాలించేవారు. పాలితులు అంటే పాలింపబడేవారు. అనగా ప్రజలు. సపోజ్ ప్రజల్ని ప్రజలే పాలించే విధంగా ప్రజాస్వామ్యాన్ని తెస్తే?" అన్నాడో మేధావి.

"అప్పుడు ప్రజలకీ, పాలించే ప్రజలకీ కూడా జవాబుదారీ లేకుండాపోతుంది. ఏ వెధవపని ప్రజాప్రతినిధులు చేసినా, ఇది ప్రజల నిర్ణయమే అని బుకాయించడమే కాకుండా వారి వారి ఛండాలపు నిర్ణయాన్ని ప్రజలమీద రుద్ది, సరికొత్త రకం నియంతలవుతారు. అంతేకాదు, వారి కుటుంబ సభ్యులనే మళ్ళీ మళ్ళీ ప్రజాప్రతినిధులుగా గెలిపించుకుని సరికొత్త రాజులుగా అవతారాలు ఎత్తుతారు. ప్రజల పరిపాలన అటకెక్కి 'కొన్ని' కుటుంబాల పరిపాలన మొదలవుతుంది" గట్టిగా చెప్పాడు స్వేచ్ఛాప్రియుడు.

"నువ్వో మూర్ఖుడివి. మేమో బ్రహ్మాండమైన పద్ధతిలో రాజ్యాంగాన్ని నిర్మిస్తాం. అది భూలోకంలో వున్న అన్ని రాజ్యాలకీ మార్గదర్శి అవుతుంది" మిగతా మేధావులందరూ తొలిమేధావితో కలిసి స్వేచ్ఛాప్రియుడి నోరు మూసేశారు.



ముసాయిదా తయారయ్యింది. తొలిమేధావి చదివాడు.

పోలీసు వ్యవస్థ. : యథాతథం

న్యాయ వ్యవస్థ. : యథాతథం

విద్యా వ్యవస్థ. : అన్ని ప్రాంతాలవారూ రిచ్చుట భాషకే ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ భాషలు తలకెక్కితే విదేశీ/ స్వదేశీయింపబడిన విదేశీ చట్టాలు అర్థం కావు.

రవాణా వ్యవస్థ : యథాతథం

కొత్తవి: ప్రతిదానికీ లైసెన్సులూ, పర్మిట్లూ మొదలెట్టి ఖజానాకు లెక్కలేనంత ధనం సమకూరుస్తూ రాబోయే ఎలక్షన్లలో గెలవదగినంత ధనం ప్రజాప్రతినిధులూ. దళారీలు, ఓటు సప్లయర్లూ గడించుకోవాలి.

వైద్య వ్యవస్థ : ఈ వ్యవస్థ పూర్తిగా ఫార్మస్యూటికల్. వారి ఆధ్వర్యంలో నడుస్తూ ఉంటుంది గనక దేశీ వైద్య విధానాన్ని వీలున్నంతగా నిర్లక్షించాలి. అన్ని 'భాషల' రోగులకీ స్వస్థత నిచ్చేవి 'ఇంగ్లీషు' మందులేనని ప్రజలకు ఆ మందులనే అలవాటు చేయాలి. 'my sin', my sin' అని వారి పాపాల్ని రోగులే తలుచుకునేలా మందుల పేరు చివర SIN రావాలి.

మిగతా వ్యవస్థలన్నీ కూడా యథాతథం గానే గాక మరింత లాభసాటిగా నడుపబడతాయి. పేద ప్రజలవల్ల పెద్దగా ఉపయోగం లేదు గనక పెట్టుబడిదారీ వ్యవస్థని బలోపేతం చేయాలి. అంతర్గత పోరాటాలు, శాసన ధిక్కారాలూ జరగకూడదంటే, పేదల్ని పేదవారుగానే వర్ధిల్లజేయడం ఉత్తమోత్తమం. నాయక వర్గానికి ఎంత బలమైన చేయూత నివ్వాలో రేపటి సభలో చర్చిద్దాం" అని కూర్చున్నాడు మేధావి.

ఓం శాంతి: శాంతిః శాంతిః

మళ్ళీ కలుద్దాం

భువనచంద్ర

# ఊరొదిలి ఉద్యోగం

## ఎలెక్ట్రాన్



స్నాతకోత్తర పట్టా చేతికందగానే ప్రభుత్వాధీన ముడిచమురు అన్వేషణా సంస్థలో ఉద్యోగం దొరికింది. అప్పటి ఉత్తర ప్రదేశ్, ఇప్పటి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని సంస్థ కేంద్రీయ స్థానంలో చేరిన వెంటనే, అప్పటికే ముడిచమురు స్థావరాలున్న ఓ ఈశాన్య రాష్ట్రానికి బదిలీ అయింది. ఓ స్థావర ఉపకేంద్రస్థానం ఏ మహానగరంలోనో, లేదా సమీపంలోనో లేదు. కేవలం పది, పదకొండు వేలు జనభా ఉన్న ఓ చిన్నపట్టణం. మాలో చాలా మంది మొదటి ఒకటి రెండు సంవత్సరాలలో చేరిన వాళ్ళం. అప్పటికింకా ఏ విధమైన వసతి సదుపాయాలూ లేని కారణంగా ఇద్దరు ముగ్గురు బ్రహ్మచారులు కలిసి, ఆర్థికంగా అవసరమున్న స్థానికులు, లేదా అవకాశవాదులైన వ్యాపారమనస్తత్వం కలవారూ తమ కొంపల్లో గదుల్ని ఖాళీ చేసుకొని ఇవ్వడంతో, ఆనాటి ప్రమాణాల ప్రకారం ఇతోధికమైన అద్దెలు చెల్లించుకొంటూ కుదుటబడ్డాం. సంస్థ ఏడాది లోపుగానే రెండు ముడిచమురు క్షేత్రాలని కనుగొనడంతో శీఘ్రగతిని కాలనీ వెలిసింది, ఊరివారు కాస్త నీరసపడ్డా, వారి వ్యాపార విస్తరణ బాగా జరగడంతో సరిపెట్టేసుకొన్నారు. రెండు ఓ మోస్తరు స్థాయిగల హోటళ్ళు, రెండు బేకరీలు, అరడజను ఫాన్సీ దుకాణాలూ, నాలుగు బట్టల షాపులు, అరడజను కిరాణా షాపులూ కాలనీకి దగ్గరగానే వెలిశాయి. సంస్థ కొత్తగా ఉద్యోగుల్ని బదిలీ చెయ్యడంతో, కాలనీలో వసతులకు కరువైపోయింది. సంస్థ ఉద్యోగులు మళ్ళీ ఊరిమీద పడ్డారు. ఇంటి యజమానులు కొత్తగా గదులు చేర్చి అద్దెలు పెంచేసి ఇవ్వసాగారు. దాంతో మరో రకమైన ఇబ్బందులు తలెత్తాయి. బదిలీల మీద వచ్చే రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకి ఇళ్ళ అద్దెలు భారమైపోవడమే కాకుండా, కూరగాయల ధరలూ, పళ్ళ ధరలూ, అపరాల ధరలూ పెరిగిపోయాయి. లీటరు పాలు పది నుంచి అంచెలంచెలుగా అనతికాలంలోనే పదిహేనుకి పెరిగిపోయింది. దిగువస్థాయి ఉద్యోగాలు కార్మిక నియమాల ప్రకారమూ స్థానికులకే లభించినా,ఆఫీసరు స్థాయి ఉద్యోగులు దేశం నలుమూలలనుంచి రావడం మూలాన, స్థానికుల సంఖ్యని గణనలోకి తీసుకొని రాష్ట్రపాలకుల రాజకీయాలు కొన్ని గొడవల్ని రేకెత్తించాయి. రాలుగాయిలు ఏదోవంకన గొడవపెట్టుకొని చాలామంది మా సంస్థఉద్యోగుల్ని తన్నులు తన్నారు. ఆ దెబ్బలు ప్రమాదకరమైనవి కాకపోయినా అవమానకరమైనవి. అలాగని ఆ రాష్ట్రాన్ని నిందించవలసిన అవసరం లేదు. ఎందుకంటే దేశమంతా ఇదే వ్యవస్థ నెలకొని ఉంది. తమకేదైనా

అవసరమొస్తే తమ రాష్ట్రంలో ఉన్న కేంద్రప్రభుత్వ సంస్థలమీద దాడి చెయ్యడం ఓ సులువైన ప్రక్రియ. 'ఈ మట్టి బిడ్డలమైన మనకి ఇక్కడే ఉద్యోగాలు దొరకాలన్న' భావన కేవలం మన రాష్ట్రాలకీ, దేశాలకే కాకుండా, గ్రామ, పట్టణాల మధ్యన కూడా తలెత్తడం పరిపాటైపోయింది. ఒకవిధంగాతప్పు పట్టలేని విషయమే అయినా, జాతీయ సమైక్యతకి ఈ భావన సరైనది కాదు.

ఈ గొడవల కారణంగా చాలామంది పైనుంచి బదిలీ మీద రావాల్సిన ఉద్యోగులు సిఫారసుల ప్రభావంతో కదిలి రాలేదు. ఒక పక్క పని పెరుగుతోంది. రెండోపక్కన జరిగిన కొద్ది సంఘటనల్నీ ఆధారం చేసుకొని రావాల్సిన వారు బెదిరి రావటల్లేదు. రాష్ట్రానికి సంబంధించిన ఆఫీసర్లు సంస్థలో ఉన్నా, వారు ఇతర రాష్ట్రాలలో కొలువుతీరి ఉన్నారు.

ఇలా నీతులు బోధించి, ఆ గణాంకాల్ని చెప్పి సమాధాన పర్చడం జరిగేది. కానీ ప్రాంతీయభావాన్ని రాష్ట్రపాలకులు తరుచూ రెచ్చగొడ్తూనే ఉంటారు. ఉన్నఊరిలోనే ఉద్యోగం దొరకడం వల్ల, కన్నవారు అదొరకమైన సంతృప్తిని పొందినా, ఉరువదిలి మరో ఊరు, రాష్ట్రం వదిలి



మరోరాష్ట్రంలో పనిచేయడమనేది-నాయకుల భావనకతీతంగా జాతీయతాభావానికి పునాదులు వేస్తుందన్న నమ్మిక నాలో ప్రబలింది. అందునా నైసర్గికంగా పాడిపంటలు, ఖనిజ సంపదలూ, జలసంపదలూ, ఒక్కో రాష్ట్రానికి ఒక్కోలా ఉండడం పకృతి మాయ. రాష్ట్రాలమధ్య సమతుల్యతను సాధించవలసిన బాధ్యతని కేంద్రప్రభుత్వం వహించక తప్పదు. అదంత సులువైన పని కాదు.

ఉద్యోగంలో చేరినతర్వాత రెండోసారి ఇంటికి వెళ్లినప్పుడు నేనెక్కడ పరాయిరాష్ట్రపు అమ్మాయిలతో ప్రేమలో పడ్తానేమోనన్న భయంతో తల్లిదండ్రులూ, నాయనమ్మలు, అమ్మమ్మలూ, మేనత్తలూ, మేనమామాలూ ఇతోధికమైన ఒత్తిళ్ళు తీసుకువచ్చేశారు. చివరికి బంధువులకు చెందిన ఒకమ్మాయిని వారే ఏకగ్రీవంగా ఎంపిక చేసేసి నా మెడలు వంచి, వంచిన ఆమె మెడలో మూడుముళ్ళూ వేయించేశారు. వయసుతో వచ్చే కోరికలు సహజంగా అబ్బాయిలచేతా, అమ్మాయిలచేతా సరేననిపించేస్తాయి. వైవాహిక జీవితంలో స్థిరపడ్డ తర్వాత, అంతా ఇంతేనా అన్న భావనతో సర్దుకు పోవడం జరుగుతుంది. సరే, ఒంటరిగా యింటికి క్షేమంగా తిరిగివచ్చి,-జంటగా నేను పనిచేస్తున్న ఈశాన్యరాష్ట్రానికి వెళ్లడంతో అందరూ శ్వాస పీల్చుకొన్నారు.

అప్పటి ఆర్థికవ్యవస్థకనుగుణంగా జీతాలు రూపాయిల కొలతలో తక్కువే అయినా, విలువలో ఎక్కువ కావడం మూలాన సంసారం ఏదో జరిగిపోయింది కాని సమస్య వచ్చి పడింది. బ్రహ్మచారిగా ఉన్నప్పుడు ముగ్గురితో కలిసి ఖర్చులు సమానంగా భరించి, జీతంలో సగభాగం




ఇంటికి పంపించేవాణ్ణి. ఇప్పుడు సహచరిణి జీవితంలో అడుగు-పెట్టడంతో ఇంటికి సొమ్ములు సగంలో సగం పంపించే పరిస్థితి వచ్చిపడింది. దాంతో నన్నాడిపో-సుకోవడం ఆరంభమైంది. పె-ళ్ళాంకొంగు పట్టుకొని తిరుగుతు-న్నాడన్న నసని నా మేనత్తలు మా నాన్నగారికీ, నా మేనమామలు మా అమ్మకీ నూరిపోశారు. ఎం-దుకంటే--పెళ్లీడుకొచ్చిన వారి అమ్మాయిల్ని కాదన్నానని. ఇతర రాష్ట్రాలవారి ధోరణులు గమ-నించిన తర్వాత మేనరికమనేది తెలుగువారి ఒక తెగులు అన్న భావన నాలో బలంగా నాటుకు-పోయింది. అందుకనే నా పెళ్లి ప్రసక్తి వచ్చినప్పుడు ఎవర్నిచే-సుకొన్నా కుటుంబ కలహాలొచ్చి తన్నుకు ఛస్తారనీ, వివాహాది వి-షయాలలో పరాయిరాష్ట్రాల సంప్రదాయాల్ని నాన్నగారి తల-కెక్కించీ, ఆయన నోటిద్వారా నా అభిప్రాయాన్ని తెలిజేయడంతో శాంతి నెలకొంది.

అయితే ఇప్పుడు నేను వారికి కొద్దిగా చేదైపోయాను. ఎనిమిదో తరగతివరకూ చదువుకొ-న్న అమ్మ నిష్ఠూరంగా ఉత్తరం రాసింది. అక్క రెండో కానుపుకు వచ్చిందనీ, ఆనవాయితీలు జరి-పించడానికి ఖర్చులుంటాయ-ని. అప్పటికి ఇంజనీరింగ్ తప్ప మరే చదువు చదివినా సంతల చదువేనన్న అభిప్రాయం బల-పడుతోన్న కారణంగా ఇంజ-నీరింగ్ కాలేజీల ఆవిర్భావం, తత్కారణంగా ముడుపుల సీట్లు ప్రారంభించడం మొదలైంది. తమ్ముణ్ణి దుమ్ములగూడెం ఇం-జనీరింగ్ కాలేజీలో చేర్పించ-డానికి మూడుపదులు ముప్పై వేలు ముడుపు చెల్లించుకోవా-లనీ, తనదగ్గర అంత సొమ్ము లేదు కాబట్టి ఎంతోకొంత పంపించమనీ నాన్న ఉత్తరం రాశాడు, ఆ ఎంతో కొంత ఇంతా అని చెప్పకుండా! దాపరికం లేకుండా నాన్నకి నా పేస్లిప్ నకలు పంపించి, నాకున్న ఖర్చుల జాబితా రాసి, 'ఆదా చేయగా నా దగ్గర ఉన్నవి ఆయిదువేలు. అవి పంపిచేస్తాను. అమ్మకి వి-య్యాలవారివద్ద గొప్పలు పోవడం

అలవాటు. అందుకని అయిదువేలు అమ్మకివ్వు. లేకపోతే నిన్ను కాల్చుకు తింటుంది!'అని ఉత్తరం రాశాను. అటునుంచి జవాబు లేదు.

ఓ రోజు సైట్ డ్యూటీ నుంచి వచ్చిన తర్వాత శ్రీమతి తీపి కబురు చెప్పింది. ఒకరిద్దరు చాలు అనుకొన్నాం కానీ, అంత త్వరలో కాదు అని ఆలోచించుకోలేకపోయాం! అదీ కాక మరో ఘోరం జరిగిపోయింది. అమ్మానాన్నలు రాసిన ఉత్తరం ఆమె కంట పడిపోయింది. ఆ ఉత్తరాలు రెండూ నాకు చూపిస్తూ ఏం చేద్దామనుకొంటున్నారు అని తన కడుపువైపు చూపించింది. ఓ ఆదివారం ఉదయం అరగంట తంటాలుపడి, పోస్టాఫీసు టెలిఫోన్ నుంచి నాన్నకి టెలిఫోన్ చేశాను.

"తమ్ముడి చదువు ఆగకూడదు. వాడు ఇంజనీరింగ్ చదవాల్సిందే. అమ్మ తాహతు వియ్యాలవారి ముందు తలెత్తుకొని ఉండాలేతప్ప దించకూడదు. ఇక్కడ మీ ముద్దులకోడలు మనింటి ఆడపడుచునో, వంశోద్ధారకుడినో కడుపున పడేసుకొని పెంచుతోంది.ఒక పని చేయండి. మీకు మిగిలిన ఆ పిత్రార్జితమైన మూడెకరాలలో ఒక ఎకరం భూమి అమ్మేసి ప్రస్తుతానికి గట్టెక్కేయండి. బేరం కుదిరితే చెప్పండి. వెంటనే వచ్చి కాయితాలమీద నా సంతకం పెట్టేస్తాను."

అంతకంటే ఏం చేయగలను? మొత్తమ్మీద అక్కడ నేను పుట్టిన మట్టిలో మాదీ అనుకొన్న భూమిలో ఒక ఎకరం భూమి మరో ఆసామి చేతిలోకి వెళ్ళి, అప్పటి అవసరాల్ని తీర్చింది. రెండేళ్లలో పదోన్నతి జరిగి, జీతం పెరిగింది. పుట్టిన పాపకూడా పెరుగుతోంది. "మనవి మధ్యతరగతి కుటుంబాలు. పాప చదువుకీ, పెళ్ళికి ఇప్పట్నుంచే సొమ్ములు కూడబెట్టాలి. నెలవారీ జీతంలో మిగిలినదంతా ఇంటికే పంపించేస్తూ ఉంటే ఎలా? పొదుపు పథకాలమీద కూడా ధ్యాస పెట్టండి మరి!" నాలుగే నాలుగు వాక్యాలలో నాశ్రీమతి తన తల్లిమనసు బయట పెట్టేసింది. నేనూ,నా మొగుడూ, నా పిల్లలూ అన్న స్వార్థం స్త్రీలలో పెళ్ళయిన వెంటనే బహిర్గతమౌతుంది కదా?.

"పాప చదువుసంగతీ, పెళ్లిసంగతీ నేను చూసుకొంటాను. నసపెట్టి సాఫీగా నడుస్తోన్న జీవితాన్నిమలుపులు తిప్పడానికి ప్రయత్నించకు. భరించువాడు భర్త! పితృ రుణం తీర్చువాడు పెద్దకొడుకు!"అని నేనూ నాలుగువాక్యాలలో ఒక వాగ్దానంతో, ఒక హితవాక్యంతో, ఒక భాష్యంతో సమాధానమిచ్చేసరికి, మొహం చిన్నబుచ్చుకొని, ఆ మర్నాటికి తెరిపిన పడింది.

ప్రాజెక్టు లో పని విపరీతంగా పెరిగింది. నా పనితీరు అధికారుల ప్రశంసలు పొందుతోనే ఉంది. ప్రశంసాపత్రాలు, రజితపతకాలూ అందుకొంటున్నప్పుడు శ్రీమతి మొహం గర్వంతో పొంగిపోయేది. ఇంట గెలవలేనప్పుడు, బయట గెలిస్తే కొంతైనా ప్రయోజనముంటుంది.

దేశంలోని ఇతర ప్రాజెక్టులలో పనిచేసిన ఓ స్థానికుణ్ణి మా ప్రాజెక్టు అధికారిగా వేశారు. ఆయన కడు సమర్థవంతుడు. ఆయన చేరడంతో ఊరివారు టముకులు వేసి సంబరాలు చేసుకొన్నారు. అటుపైన ఆయనమీద స్థానికుల ఒత్తిళ్ళు ప్రారంభమైయ్యాయి. ఉద్యోగాలకోసం, కాంట్రాక్టులకోసం, స్థానిక రాజకీయనాయకుల అనవసర జోక్యాలూ, ఇతరత్రా అనేక అంశాలు తలెత్తాయి. తన్నులు తిన్న ఆఫీసర్లు 'స్థానికుల్నే ఆయన సమర్థిస్తున్నారు' అని, వారిమీద క్రమశిక్షణా రాహిత్యానికి చర్యలు తీసుకోవల-

సిందిగా విన్నపాలు ముఖాతాః, కాయితాలమీదా చేసుకొనే వారు. అవతలి వారు వీళ్ళు తమ మీద అకారణంగా నోరుచేసుకొంటున్నారనీ, తక్కువచేసి మాట్లాడుతున్నారని, రాష్ట్ర గౌరవాన్ని కించపరుస్తున్నారనీ నిందారోపణలు. వాటిలో కొన్నికాయితాలమీద పెట్టలేని కారణాలు. ఆయనకి విసిగెత్తిపోయి తలపట్టుకొన్నాడు. ఓ రోజున ఏదో ఆఫీసుపని మీద ఆయన్ని కలుసుకొన్నరోజున, నేను తీసుకువెళ్లిన దస్త్రం మీద సంతకం పెట్టేసి, కూర్చోమని చెప్పి టీ తెప్పించాడు. ఆ తర్వాత తన గోడు వినిపించుకొన్నాడు. చివరగా అన్నాడు. "జియోపాలిటిక్స్ అంటే భౌగోళిక లేదా నైసర్గిక రాజకీయాలు ఇప్పుడు దేశంలోని ప్రతి సంస్థనీ అల్లలాడిస్తున్నాయి. ఇటు రాజకీయాలు నడిపే రాష్ట్ర నాయకులు, నిరుద్యోగులైన స్థానికులూ, అటు అవగాహనాలోపంతో నిర్ధారించే కేంద్రసంస్థ లక్ష్యాలూ,నియమాలూ, మనలాంటివారిని నిర్వీర్యులను చేస్తున్నాయి. నేను గోలపెడ్తూనే ఉన్నాను,నన్నిక్కడికి పంపిచవద్దని. నువ్విక్కడ చేరినప్పట్నుంచీ పదేళ్లకుపైగా పనిచేస్తున్నావ్! ఇక్కడివారందరికీ నీ మీద మంచి అభి-



ప్రాయమే ఉందని తెలిసింది, కారణం''?

"సర్! ఇదొక చిన్న ఊరు. సంస్థ విస్తృతి కారణంగా అందరికీ ఇదొక ఉద్యోగాల నిలయమనే అభిప్రాయం కలిగిపోయింది. ఇందులో పరాయి రాష్ట్రాలవారూ, స్థానికులూ అన్న విషయం కొంత లేదనలేనుకానీ, సంస్థ ఉద్యోగులూ, సంస్థ ఉద్యోగులు కానివారి మధ్యనున్నఆర్థిక పరమైన తేడాలు కారణం. జన్మభూమి పుత్రులు అయ్యుండి కూడా తమని సమర్థించటల్లేదని కొంతమంది స్థానిక ఆఫీసర్లుకూడా తన్నులు తిన్నారు. చెన్నై, కోల్కతాలాంటి మహానగరాలకే ఈ పాట్లు తప్పటల్లేదు. నిరుద్యోగతా, కొట్టవచ్చేటట్లు కనబడుతోన్న ఆర్థిక వ్యత్యాసం మూలకారణాలు. సంస్థ మూలాన ధరవరలు పెరిగిపోయిన కారణంగా స్థానికులకు చికాకుకలగడం సహజం. అదీ కాక రాష్ట్రేతరులందరూ మడికట్టుకొని కూర్చున్నారనికాదు. కొంతమందికి అధికారవర్గానికి చికాకులు కల్పించి నిర్వీర్యం చెయ్యడమనేది ఒక అలవాటు. వారి మూలాన చాలా గొడవలు జరిగాయి. అటూ, ఇటూ సర్దిచెప్పుకొంటూ పోవడమే తప్ప గత్యంతరం లేదు. నా కింద పనిచేసే స్థానికులందరితోనూ మంచిగా ప్రవర్తిస్తాను. నా హోదాని పక్కకి నెట్టి చేయవలసిన పనిని సౌమ్యంగా చెప్తాను. అవసరమైనచోట నా భుజాన్నికూడా బరువులమోతలో అందిస్తాను. ఇది నేను రష్యన్లనుంచి నేర్చుకొన్న శ్రామికగౌరవ పాఠం. సాంకేతికంగా వాళ్లకేసమస్య వచ్చినా దగ్గరుండి వివరిస్తానుకాని, విరుచుకు పడను."

పొరుగురాష్ట్రాలనుంచి వచ్చి

ఉన్నతస్థాయిలో ఉన్న ఆఫీసర్లు- ప్రాజెక్టు అధినేతగా మరో ప్రాజెక్టు ఏరియా నుంచి ఈయన రావడంతో కినుకవహించి చాలా సమస్యలు తీసుకురావడంతో ఈయన బదిలీ చేయించుకొని పశ్చిమ తీరంలోని ఓ అతి పెద్ద ప్రాజెక్టుకి వెళ్లిపోయాడు. అక్కడ అపారమైన ప్రజ్ఞాపాటవాలతో పనిచేసి, సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ లో ఒకర్తై, సాంకేతిక విభాగానికి సారథ్యం వహించాడు.

తర్వాత కాలచక్రం ఎగుడు దిగుళ్లతో నడిచిపోయింది. బదిలీలు అయ్యాయి. నా యిద్దరి పిల్లల చదువులకి కొన్ని అంతరాయాలు కలిగినా అవలీలగానే గట్టెక్కుతూ వచ్చారు. తమ్ముడు చదువుకి దన్ను నిలిచాను. చెల్లి పెళ్లికి ఉన్న రెండెకరాలూ తరిగిపోకుండా ఆసరాగా నిలిచాను. అప్పటికి నా స్వంత గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరంలో మా సంస్థ ప్రాజెక్టు కాళ్లూనింది. సంస్థ కార్యక్రమాలు ప్రారంభమయిన దినం నుంచి యింటిపోరు మళ్ళీ మొదలైంది. మా ఊరిదగ్గరి నగరానికి బదిలీ చేయించేసుకోమని. పిల్లల చదువులు పశ్చిమ ప్రాంతపు కేంద్రమైన బరోడాలో స్థిరంగా, ఒబ్బిడిగా జరుగుతుండడం మూలాన సర్ది చెప్పాను. రాకుండా అడ్డుపెడ్తోందని శ్రీమతి మీద చిన్నచిన్న విసుర్లు మళ్లీ విసిరారు కానీ, అమ్మానాన్నలకి నన్ను గట్టిగా నిలదీసే అడిగే నైతికబలం లేకపోయింది.


నా ఉద్యోగధర్మం నిర్వహించుకుంటూ పోయాను. పదోన్నతులు చేజారిపోకుండా రావడం మూలాన ప్రాజెక్టుహెడ్ స్థాయికి చేరాను. అప్పుడు నన్ను నగరానికి బదిలీ చేశారు. స్థానికమైన పత్రికలు నగర ప్రాజెక్టు అధిపతిగా తెలుగుబిడ్డ బదిలీ అంటూ వార్తలు వచ్చేశాయని తమ్ముడు ఫోన్ చేశాడు. వాడప్పటికి పేపరు మిల్లులో ఉద్యోగం చేస్తున్నాడు. వాడికీ వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టారు.నా బదిలీ వార్త మా కుటుంబ సభ్యులలో, బంధువర్గంలో చెలరేగిన ఆనంద తరంగాలతో బాటు ఆశల అలలు కూడా కలిసిపోయాయని బంధువర్గంనుంచి నాకు వచ్చిన ఉత్తరాలు విశదం చేశాయి. ఈశాన్యప్రాంతంలోని నా అనుభవాలు హెచ్చరిక చేశాయి.

కేంద్రప్రభుత్వసంస్థ తాలూకు ఉద్యోగి స్వంతరాష్ట్రంలో ఆసంస్థ ప్రాంతీయ అధికారిగా పనిచేయడమనేది ఓ పెద్ద సమస్యయి కూర్చుంటుంది. రాష్ట్రనేతల జోక్యంతో బాటు బంధు, స్నేహ వర్గాల ఒత్తిళ్ళు శతావధానాలై కూర్చుంటాయి. మనశ్శాంతి కరువైపోతుంది. యిది పలాయనవాదం కాదుకాని, తెలుగువాడికి తెలుగువాడు సహాయం చెయ్యడన్న మాట పలువురు వక్కాణించినా, ప్రతిరాష్ట్రం వారూ ఇలాగే అనుకొంటారనీ, అంటారన్నదీ నా స్వానుభవం.

సంస్థ అధ్యక్షులవారిని కలుసుకోడానికి ఢిల్లీ బయలుదేరాను. శ్రీమతి ఏడుకొండలవాడికి మొక్కుకొంది.ఎందుకో వేరే చెప్పాలా? అయితే మన గత ప్రధాన మంత్రి లాల్ బహదూరు శాస్త్రిగారిలా బంధుపక్షపాతి కాదని నన్ను మెచ్చుకొనేవారెవరూ లేరు. ఇంటికి ఏ శుభకార్యాలకి వెళ్ళినా నొసళ్లు నొక్కుకొనే బంధుజనాలే కనిపించేవారు.

****

# వేదులాన్వయు పలుకు -8



వేదుల సుబ్రహ్మణ్యం

తీర్థముల కేగలేదను దిగులు వలదు
దేహమెల్లరకును గాదె దేవళంబు
అంతరాత్మయె నిల పరమాత్మ సుమ్మ!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 101

ఒరుల చూచి యసూయను బరగ జేయు
మనసు నరికట్టి మసలుట మాన్యమగును
శాంతి చేకూరుటకు నిది సాధనంబు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 102

రాజకీయములను బట్టి రచ్చకెక్కి
బాధ్యతను వీడి పదవుల బట్టు వారి
చక్క దిద్దరె ప్రజలొక సమయమరసి!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 103

శత్రువైనను వేడిన శరణు నిచ్చు
కాల మేనాడొ చెల్లె నీ కలియుగమున
వడి నెరుంగక దూకకు వాగునందు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 104

వైరి జిత్తులు ఛేదించి ధీరునివలె
వెన్ను జూపక పోరాడి కన్నుమూయు
దేశభక్తుని గొనియాడు దిశలు మ్రోగ
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 105

నేటి బాలురు రేపటి నేతలగుట
నెరిగి వారిని సన్మార్గ మెంచి పెంచి
దేశ ప్రగతిని చాటుము దిశలు దాట
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 106

గురువునేర్పిన విద్యను మరుగుపుచ్చి
మనసు మెచ్చిన జీవన మనుసరింప
గురువు కపహాస్యమంటిన బరగు ముప్పు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 107

సంధ్యవార్చుము దినమొక సారియైన
మనసు నాధ్యాత్మికము నందు మసలునట్లు
చేసి సద్బుద్ధి నిచ్చి రక్షించు నిన్ను
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు II 108

* సంపూర్ణం *

-- ఓం తత్సత్ --

# పూరి జగన్నాథ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్మ్యాన్ని యథామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

## 32 వ అధ్యాయం

### జైమిని -ఋషి సంవాదము.

**పంచ జ్యేష్ఠ స్నాన విధి:**

స్వామికి పంచ భక్ష్య పరమాన్నంతో నైవేద్యం సమర్పించాలి. ఉపచారాలు పూర్తి అయిన తరువాత శ్రీరామ, శ్రీకృష్ణ, బలరామ, సుభద్రల విగ్రహాలకు నృత్య, గీత, వాయిద్యాలతో ఆనందింపచేయాలి. బ్రాహ్మణులకు దానాలు చేయాలి. స్వామిని తీసుకు వచ్చేటప్పుడు, పూర్వంచేసిన ఉత్సవాలు అన్ని చేయాలి. దక్షిణంగా వెడుతున్న స్వామిని చూసినవాడు సామాన్య మానవుడు కాదు. దేవతలు స్వామిని చూడడానికి ఎదురు చూస్తున్నారు. విగ్రహాలకు నీరాజనం ఇచ్చి, లోపలికి తీసుకు రావాలి. తరువాత స్వామిని చూడకూడదు.

జ్యేష్ఠ పంచక వ్రత విధానాన్ని జైమిని ఈ విధంగా చెప్పాడు. ఈ వ్రతాన్ని బ్రహ్మ బోధించాడు. వ్రతాలన్నిటిలోను ఈ వ్రతం మొదటిది అవడం వలన ఈ వ్రతానికి జ్యేష్ఠ పంచక వ్రతం అని పేరు వచ్చింది.



మంచెపై ఉన్న స్వామిని చూస్తే ఏ విధమయిన ఫలితం కలుగుతుందో అదే విధమయిన ఫలితం జ్యేష్ఠ పంచక వ్రతాన్ని చేయడం వలన కలుగుతుంది. జ్యేష్ఠమాసం, శుక్ల పక్షం పౌర్ణమి రోజున ఈ వ్రతాన్ని ప్రారంభించాలి. ఈ సమయంలో అన్ని తీర్థాలు సముద్రాలు పురుషోత్తమ క్షేత్రానికి వస్తాయి. స్వామి జ్యేష్ఠ స్నానం చూడాలి అని అనుకొనేవారు అదృష్ట వంతులు అవుతారు.

జ్యేష్ఠమాసం దశిమి రోజున నియమాలను స్వీకరించాలి.ఉత్తముడైన బ్రాహ్మణుని ఆచార్యునిగా నియమించాలి." ఓ దేవ దేవా! జగన్నాధా! ఈ రోజునుండి జ్యేష్ఠ తిథి ఉండేవరకు వ్రతాన్ని ప్రారంభిస్తున్నాను. అన్ని తీర్థజలాలతో నీకు అభిషేకం చేస్తున్నాను. మూడు సంధ్యలలోను నిన్ను అర్చించడానికి అనుగ్రహించు" అని ప్రార్థించాలి.

తరువాత స్వామికి అభిషేకం పూర్తి చేయాలి. మండపం ఏర్పాటు చేసి, పద్మానివాసినిని, మధ్యలో కుంభాన్ని ఏర్పాఛేయాలి. ఆ కుంభంలో తీర్థ జలాలు పోయాలి. ఆ కుంభంలో చందనం, పళ్ళు వేయాలి. రాగిపళ్ళెం మూత పెట్టాలి. మధ్యలో బంగారంతో చేసిన స్వామి ప్రతిమ ఉంచాలి. లక్ష్మీ దేవి ప్రతిమ, మోకాళ్ళపై కూర్చున్న గరుత్మంతుని విగ్రహాన్ని పెట్టాలి. స్వామి శాంతి స్వరూపుడై ఉండాలి. చక్రాలు ధరించి ఉండాలి. పద్మాసనంలో స్వామి కూర్చుని ఉంటాడు. (1- 36 )

నల్ల కలువలతో స్వామిని పూజించాలి. ఈ విధంగా దశమి రోజున పూజిస్తే పదికోట్ల పాపాలు నశిస్తాయి. "మధుసూదనా! దేవేశా! లక్ష్మీనాథా! దయా సముద్రా! సంసార సముద్రంలో పడిఉన్న నన్ను రక్షించు" అని ప్రార్థించాలి. ( 37- 41 )

ఏకాదశి రోజున నాలుగు భుజాలు కలిగిన స్వామిని ఆరాధించాలి.శంఖము, చక్రము, గద, పద్మం ధరించి ఉండాలి. పాయసం, అరటిపళ్ళు నైవేద్యం పెట్టాలి. "నారాయణా! సంసార సముద్రాన్ని దాటించువాడా!



శరణన్నవారిని రక్షించువాడా! పుండరీకముల వంటి కన్నులు కలవాడా! నన్ను కాపాడు.పదకొండు ఇంద్రి యాలతో చేసిన పాపాలు, జన్మజన్మల నుండి చేసిన పాపాలను పోగొట్టు" అని ప్రార్థించాలి. ద్వాదశి రోజున బంగారు యజ్ఞ వరాహమూర్తిని ప్రార్థించాలి. చందనం, అగరు, కర్పూరం, స్వామికి రాయాలి. అరెసెలు,పండ్లు, నైవేద్యంగా పెట్టాలి. "భూమిని ఉద్ధరించినవాడా! నీ పాదాలను ఆశ్రయించిన నన్ను ఉద్ధరించగలవు. ఈ సంవత్సరములో చేసిన పాపాలు, క్రితం జన్మలో చేసిన పాపాలు పోగొట్టు" అని ప్రార్థించాలి. త్రయోదశి రోజున పద్మంలో ఉన్న శంఖ చక్ర వరద అభయ ముద్రలు ధరించి ఉన్న ప్రద్యుమ్నుని పూజించాలి. అశోకము, పాటలి పువ్వులతో చేసిన మాలలు స్వామికి అర్పించాలి. అన్నము, పండ్లు స్వామికి సమర్పించాలి. "దేవా! ప్రద్యుమ్నా1 కోరికలు తీర్చువాడా! నా కోరికలు అన్ని తీర్చు"అని ప్రార్థించాలి. (42-51)

చతుర్దశి రోజున బంగారు నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి. స్వామి వక్షస్థలంపై లక్ష్మీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి. స్వామి అట్టహాసంగా నవ్వుతున్నట్లుగా ఉండాలి. నీ వాడియైన గోళ్ళతో నా పాపాలను చీల్చి వేయి" అని ప్రార్థించాలి. నైవేద్యాన్ని సమర్పించాలి. జపా కుసుమాలు, జాజిపూల మాల సమర్పించాలి. చేతులు జోడించి నమస్కరించాలి. ఈవిధంగా పంచజ్యేష్ఠ వ్రతాన్ని పూర్తి చేయాలి. ఐదు దీపాలు నిత్యం వెలిగేటట్లుగా ఉంచాలి. ఐదు వస్త్రాలు, గొడుగులు, చెప్పులు, కంచాలు మొదలయవి దానం చేయాలి. పౌర్ణమి రోజు ఉదయాన్నే స్నానం చేసి, శ్రీకృష్ణుని దర్శించుకోవాలి. యధావిధిగా అర్చించాలి. ఒక్కొక్కరిని వేరుగా అర్చించాలి. బ్రాహ్మణులకి దానం చేయలి. ప్రధాన ఆచార్యునికి బంగారం దానం చేయాలి. నైవేద్యం పెట్టాలి. మధ్యలో వచ్చే ఏకాదశిని "నిర్జల" అని పిలుస్తారు. ఆ రోజున భక్తి శ్రద్ధలతో స్వామిని అర్చించాలి. అన్ని వ్రతాలు చేసిన ఫలితం కలుగుతుంది.( 52 -74)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలోని పురుషోత్త మ క్షేత్ర మాహాత్మ్యంలోని,జైమిని ఋషి సంవాదంఅని ముప్పై రెండవ అద్యాయం సమాప్తం.

# గ్రీసు దేశపు పురాణ గాథలు



వేమూరి వేంకటేశ్వరరావు

“Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence.”
Aldus Huxley. “Knowledge and Understanding”

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, “మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి,” అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా “ఇరవై నిమిషాల కార్యక్రమం” చూద్దామని వెతకడం ఉపక్రమించేను. “అపస్వరం అనే ఏపిల్ పండు కథ” ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.

పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, “చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను” అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అని-పించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.

ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 13. ఎడిపస్ విషాద గాథ

గ్రీసు పురాణగాథలలో ఎడిపస్ (Oedipus) కథ పేరెన్నికగన్న కథ. సంస్కృతంలో కాళిదాసు "శాకుంతలం" ఎంత పేరు పొందిందో గ్రీకు భాషలో సోఫో-క్లిస్ (Sophocles, సా. శ. పూ. 496 - 405) రచించిన "ఎడిపస్ రెక్స్" (Oedipus Rex or King Oedipus) అనే నాటకం అంత చెప్పుకోదగ్గది. చిఱుతప్రాయంలో పిల్లలు ఎదుర్కొనే ఒక విచిత్ర-మైన మనోస్థితిని వర్ణించడానికి ఆధునిక మానసిక శాస్త్రవేత్త సి-గ్మన్డ్ ఫ్రాయిడ్ "ఎడిపస్ కాంప్లె-క్స్" అనే పదబంధాన్ని ప్రవేశపెట్టి ఎడిపస్ కథకి ఒక రకం ప్రాచు-ర్యం తీసుకొచ్చేడు; అంతే కానీ ఎడిపస్ ఈ రకం మనోస్థితిని ఎదుర్కొనలేదు.



బొమ్మ. స్పింక్స్ అడిగిన ప్రశ్నకి ఎడిపస్ సమాధానం చెప్పడం (వికీపీడియా)

## 13.1 థీబిస్ రాజ్యంలో ఎడిపస్ పుట్టుక

ఎడిపస్ కథ ఎడిపస్ పుట్టుక మునుపే మొదలయింది. థీబిస్ (Thebes) రాజ్యానికి రాజైన లెయుస్ (Laius) కి పుత్ర సంతతి లేకపోతే డెల్ఫైలో ఉన్న ఓరకిల్ ని సంప్రదించడానికి భార్యా సమేతంగా వెళతాడు. "మీ ఇద్దరికి పుట్టబోయే సంతానమే నీ చావుకి కారకుడవుతాడు. కనుక ఆ కోరిక విరమించుకో," అని ఓరకిల్ లెయుస్ కి సలహా చెబుతాడు. ఓరకిల్ సలహా తు. చ. తప్ప-కుండా పాటించడానికి లెయుస్ నిశ్చయించుకొని భార్య పట్ల అతి జాగరూకతతో ఉండేవాడు. కానీ వసంత ఋతువు విజృంభించిన ఒక వెన్నెల రాత్రి, మధుపాన-పు మత్తులో, నిగ్రహాన్ని కోల్పో-తాడు. రాణి యొకాస్టా గర్భవతి అవుతుంది. నెలలు నిండగానే పండంటి మగ శిశువుని కంటుంది. ఓరకిల్ చెప్పిన జోశ్యపు బారినుండి తప్పించు-కోడానికి శిశువు చీలమండలు రెండింటికి సూదులు గుచ్చెయ్య-మని భటులకి ఆదేశాలు ఇచ్చేడు,

రాజు. అలా చేస్తే శిశువు పాకడం, నడవడం వంటి పనులు చెయ్యలేడు కనుక తన చావుకి కారకుడు కాలేడని రాజు ఊహ. రాజాజ్ఞ శిరసావహించేరు సేవకులు. "ఎందుకైనా మంచిది, శిశువుని హతమార్చడమే శ్రేయస్కరం" అని మంత్రుల సలహా ఇవ్వగా శిశువుని కొండలలోకి తీసికెళ్ళి చంపెయ్యమని రాజ్యంలో ఉన్న ఒక గొర్రెల కాపరికి ఆదేశాలిచ్చాడు, రాజు. పసివాడి ప్రాణాలు తియ్యడానికి మనసు ఒప్పక ఆ గొర్రెల కాపరి ఆ బాలుడిని పొరుగున ఉన్న కోరింత్ రాజ్యపు మరొక గొర్రెల కాపరికిస్తే, అతను పసివాడిని పెంచుకున్నాడు.

## 13.2 కోరింత్ రాజ్యంలో ఎడిపస్ పెరుగుట

కోరింత్ (Corinth) రాజ్యపు రాజు పోలిబస్ (Polybus), రాణి మెరోపి (Merope) లకి పిల్లలు లేరు. అందుకని ఈ రెండవ గొర్రెల కాపరి పసివాడిని రాజుకి కానుకగా ఇచ్చేడు. సూదిపోట్ల వల్ల పసివాడి చీలమండలు రెండూ వాచి ఉండడం చూసి పోలిబస్ పసివాడికి ఎడిపస్ అని పేరు పెట్టేడు - ఎడిపస్ అంటే "వాచిన పాదం" అని



అర్థం. (వైద్య పరిభాషలో ఎడీమా (edema) అంటే వాపు అని అర్థం ఉంది కదా!)

ఎడిపస్ పెద్దవాడైన తరువాత ఒక తాగుబోతు మైకంలో ఉన్నప్పుడు, "రాజు పోలిబస్, రాణి మెరోపి నీ జనక తల్లిదండ్రులు కారు తెలుసా?" అని అన్నాడు. ఈ వదరుబోతు మాటలలో నిజం ఎంతో, పేలాపన ఎంతో తేల్చుకుందామని ఎడిపస్ డెల్ఫీ వెళ్లి అక్కడ ఒరకిల్ ని సంప్రదించేడు. అడిగిన ప్రశ్న ఏమిటో కానీ ఒరకిల్ ఇచ్చిన సమాధానం ఎడిపస్ ని కలవరపరచింది: "నువ్వు నీ తండ్రిని చంపేసి నీ తల్లిని వివాహం చేసుకుంటావు." ఈ జోశ్యం విన్న ఉత్తర క్షణంలో ఎడిపస్ కోరింత్ రాజ్యపు పొలిమేరలు దాటి ఎంత దూరం వీలయితే అంత దూరదేశాలకి వెళ్ళిపోదానికి నిశ్చయించుకుని, ఉత్తర దిశగా ప్రయాణంచేసి, చిట్టచివరికి, విధి వెంట తరమగా, థీబిస్ రాజ్యం పొలిమేరలకి చేరుకుంటాడు!

## 13.3 మూడు బాటల మొగలో పోరు

థీబిస్ రాజ్యపు పొలిమేరలలో, ఒక మూడు బాటల మొగలో, ఎడిపస్ దారికి ఒక రథం అడ్డుపడుతుంది. ఆ రథ సారథి "పక్కకి తప్పుకో, దారి విడు" అని అరుస్తాడు.

"నేను ముందొచ్చాను. నేనెందుకు తప్పుకోవాలి. నువ్వే తప్పుకో" అని ఎడిపస్ అంటాడు. మాట మీద మాట పెరిగి, పోరాటంలోకి దిగగా రథ సారథినీ,



రథారూఢుడైన రాజుని ఎడిపస్ చంపేస్తాడు. ఒక భటుడు మాత్రం తప్పించుకుని పారిపోతాడు. ఆ రథంలో ఉన్న వ్యక్తి థీబిస్ రాజ్యపు రాజన్న విషయం కానీ, ఆతను తన కన్న తండ్రే అన్న విషయం కానీ, ఎడిపస్ కి తెలియదు. ఈ విధంగా ఓరకిల్ చెప్పిన జోశ్యంలో మొదటి భాగం నిజం అయింది!

## 13.4 స్ఫింక్స్ అడిగిన ప్రశ్న

థీబిస్ రాజ్యపు పొలిమేరలు దాటుకుని లోపలికి వెళ్లడానికి ప్రయత్నించే సరికి ఎడిపస్ కి స్ఫింక్స్ రూపంలో మరొక సమశ్య ఎదురవుతుంది. ఈ స్ఫింక్స్ (Sphinx) అనే శాల్తీ ఒక రకం కంచర "నరసింహ" రూపం! ఈ శాల్తీ తల మానవాకారంలోను, సింహపు శరీరంతోనూ ఉండడమే కాకుండా దీనికి డేగ రెక్కలు కూడా ఉంటాయి! ఏకచక్రపురాన్ని బకాసురుడు వేధించుకు తిన్నట్లు థీబిస్ రాజ్యాన్ని కొంత కాలం బట్టి ఈ స్ఫింక్స్ వేధించుకు తింటోంది. ఈ స్ఫింక్స్ ఊరి పొలిమేరలో ఉన్న ఒక రాతి తిన్నె మీద తిష్ఠ వేసి ఊళ్లోకి వెళ్ళే వాళ్లందరినీ పొడుపుకథ లాంటి ఒక కఠిన ప్రశ్న అడుగుతుంది. ఆ ప్రహేళికకి సరి అయిన సమాధానం చెప్పలేని వారిని చంపుకు తింటుంది. ఊరి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించే ఎడిపస్ ని స్ఫింక్స్ అడ్డుకుని అందరినీ అడిగే ప్రశ్ననే అడిగింది: "ఉదయం నాలుగు కాళ్ళ తోటీ, మధ్యాహ్నం రెండు కాళ్ళ తోటీ, సాయంత్రం మూడు కాళ్ళ తోటీ నడచేది ఏది?" అప్పటి వరకు ఈ ప్రహేళికకి సరి అయిన సమాధానం చెప్పిన వారు లేరు. ఎడిపస్ ఆలోచించి, తర్జనభర్జన పడి, చిట్టచివరికి, "మనిషి: బాల్యంలో నాలుగు కాళ్ళ మీద పాకుతాడు, నడివయస్సులో రెండు కాళ్ళ మీద నడుస్తాడు, ముసలితనంలో చేతికర్ర పట్టుకుని మూడు కాళ్ళతో నడుస్తాడు." ఇలా గర్వభంగం చెందిన స్ఫింక్స్ జరిగిన పరాభవాన్ని తట్టుకోలేక తను కూర్చున్న ఎత్తుగా

ఉన్న రాయి మీంచి కిందకి దూకి ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతుంది.

## 13.5 ఎడిపస్ థీబిస్ రాజ్యానికి రాజు అవడం

థీబిస్ రాజ్యానికి పీడ విరగడ అవడంతో, ప్రజల సంతోషానికి అవధులు లేవు. వారు ఎడిపస్ కి బ్రహ్మరథం పట్టేరు. వారి రాజు లెయుస్ బందిపోట్ల బల్లేలకి ఆహుతి అయిపోయాడని నమ్మి, ఇప్పుడు ఆ రాజు లేని లోటు తీరిందని సంతోషంతో ప్రజలు ఎడిపస్ కి పట్టం కట్టేరు. అప్పటి ఆచారం ప్రకారం భర్తని కోల్పోయిన లెయుస్ భార్య యొకాస్టా ఎడిపస్ కి పట్టమహిషి అయింది!! తను చంపినది తన తండ్రినే అనిన్నీ, తను వివాహం చేసుకున్నది తన తల్లినే అనిన్నీ ఎడిపస్ కి కాని అనుచరులకి కానీ ఊహామాత్రంగానైనా తెలియలేదు. విధి వైపరీత్యం!! ఎడిపస్-యొకాస్టా ల దాంపత్యానికి ఫలితంగా నలుగురు పిల్లలని కంటారు: ఎటేయోక్లిస్, పోలినీసిస్, ఏంటిగోనీ, ఇస్మేనీ (Eteocles, Polynices, Antigone, Ismene).

## 13.6 థీబిస్ నగరానికి మహామ్మారి ప్లేగు

కొన్ని ఏళ్ళు గడచిన తరువాత థీబిస్ నగరానికి మహామ్మారి ప్లేగు పట్టుకుంటుంది. ప్రజలని పీడిస్తున్న ఈ వ్యాధి పట్టు నుండి విముక్తి కలిగించడానికి తరుణోపాయం ఏదైనా ఉందేమో కనుక్కుని రమ్మని బావమరిది క్రియోన్ ని డెల్ఫి లో ఉన్న ఓరకిల్ దగ్గరకి సంప్రదింపులకి పంపుతాడు, ఎడిపస్. “థీబిస్ రాజైన లెయుస్ ని అన్యాయంగా చంపిన వ్యక్తి తాను చేసిన దుష్కృత్యానికి ప్రాయశ్చిత్తం పొందలేదు కనుక ప్రజలకి ఈ ఇక్కట్లు వస్తున్నాయి” అని ఓరకిల్ చెబుతాడు. ఈ వార్త విన్న తరువాత లెయుస్ ని అన్యాయంగా చంపిన వ్యక్తిని దండించి తీరుతానని ప్రతిన పడతాడు - ఆ వ్యక్తి తానేనన్న ఊహ లేశమాత్రమైనా లేని ఎడిపస్! లెయుస్ ని చంపిన వ్యక్తి ఎవ్వరో తెలుసుకోవడం ఎలా? ఎడిపస్ తన ఆస్థాన జ్యోతిష్కుడు టైరిసియాస్ ని సంప్రదిస్తాడు. పుట్టుగుడ్డి అయిన టైరిసియాస్ నేరస్తుడు ఎవ్వరో ఎడిపస్ వైపు వేలు పెట్టి చూపిస్తాడు. ఇదేదో బావమరిది క్రియోన్, జ్యోతిష్కుడు టైరిసియాస్ తో కలసి తనని పదవీభ్రష్టుడిని చెయ్యడానికి చేసిన కుట్ర అని వారిరువురి మీద నింద మోపుతాడు, ఎడిపస్.

## 13.7 పోలిబస్ మరణ వార్త

తొండ ముదిరి ఊసరవిల్లి అయినట్లు కథనం ఇలా మలుపు తిరిగే సరికి రాణి యొకాస్టా కి అసలు ఏమి జరిగిందో తెల్సుకోవాలనే దుగ్ధ పెరిగి ఎడిపస్ ని జరిగిన పాత సంఘటనలు అన్నిటిని కాలక్రమానుగతంగా చెప్పమని అడిగింది. ఎడిపస్ చెప్పిన ఉదంతంతో తనకి తెలిసిన వాటితో పోల్చి చూసుకునే సరికి ఆమె అనుమానాలు పెనుభూతాలై కూర్చున్నాయి. నిజం తేలాలంటే థీబిస్ రాజ్యపు సరిహద్దులలో, మూడు వీధుల మొగలో, ఎడిపస్ రథాన్ని ఎదుర్కొని యుద్ధం చేసిన వ్యక్తులు ఎవ్వరో నిర్ధారించాలి. ఆ యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూసి, యుద్ధ రంగం నుండి ప్రాణాలతో పారిపోయిన వ్యక్తి ఒక భటుడు. ఆ భటుడి కోసం వేట మొదలయింది. ఈ వేట ముగిసే లోగా కోరింత్ రాజు, పోలిబస్, చనిపోయాడని ఒక వార్తావహుడు ఎడిపస్ కొలువు లోకి వార్త తీసుకువచ్చాడు. తన తండ్రి చనిపోయాడన్న విచారం ఒక పక్క, తన తండ్రి మరణానికి తను కారణం కాలేదన్న ఉపశమనం మరొక పక్క పోటీ

పడుతున్నాయ్ ఎడిపస్ మనోఫలకంలో. తండ్రి అంత్య క్రియలు చెయ్యడానికి వెళితే తన తల్లిని చూడవలసి వస్తుంది. అప్పుడు ఓరకిల్ చెప్పిన జోశ్యంలో రెండవ భాగం నిజం ఆయే ప్రమాదం ఉంది. ఇలా ఆలోచించి ఎడిపస్ తన తండ్రి పార్ధివ దేహాన్ని కడసారి చూడ్డానికి కూడా వెళ్ళనంటాడు. "మీకా భయం అక్కర లేదు. కోరింత్ రాజ్యపు రాజు పోలిబస్, రాణి మెరోపి కి పిల్లలు లేరు. నేనే అడవిలో దొరికిన ఒక పసిబాలుడిని వారికి కానుకగా ఇచ్చేను." అని వార్తావహుడు అశనిపాతం లాంటి వార్త చెబుతాడు.

## 13.8 వెల్లడి అయిన వాస్తవం

రాణి యొకాస్టాకి కావలసిన ఋజువు దొరికింది. తన కొడుకునే భర్తగా స్వీకరించిన అఘాయిత్యానికి నిష్కృతి కనిపించలేదు. ఆమె వెంటనే రాజప్రాసాదపు అంతర్భాగంలోకి వెళ్లిపోతుంది.

మూడు వీధుల మొగలో, ఎడిపస్ తో జరిగిన యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూసి, యుద్ధ రంగం నుండి ప్రాణాలతో పారిపోయిన భటుడు చిట్టచివరికి దొరుకుతాడు. అతని సాక్ష్యంతో ఎడిపస్ కి జరిగిపోయిన కార్యక్రమం అంతా అర్థం అవుతుంది. పరుగుపరుగున యొకాస్టా కోసం అంతిపురంలోకి వెళతాడు. అక్కడ ఉరి పోసుకుని ప్రాణాలు విడిచిన రాణిని చూసి నిర్విణ్ణుడవుతాడు. నోట మాట రాదు. రాణి వస్త్రాలకి సూదితో గుచ్చి ఉన్న ఆభరణాన్ని తీసుకుని తన కళ్ళు రెండూ పొడిచేసుకుని గుడ్డివాడయిపోతాడు. థీబిస్ సింహాసనాన్ని క్రియోన్ అధిష్టించి ఎడిపస్ ని రాజ్యం నుండి బహిష్కరిస్తాడు.

## 13.9 సిగ్మన్డ్ ఫ్రాయిడ్ వ్యాఖ్యానం

తెలుగు సినిమా కథలా ఉన్న ఈ కథని ఆధారంగా చేసుకుని ప్రాచీన కాలంలోనే గ్రీకు భాషలో సోఫోక్లిస్ "ఎడిపస్ రెక్స్" (**Oedipus Rex or King Oedipus**) అనే నాటకం రచించేడు. జెర్మనీ, ఫ్రాన్స్ దేశాలలో ఎంతో ప్రజాదరణ పొందిన ఈ నాటకాన్ని సా. శ. 1880 లలో మానసిక శాస్త్రవేత్త సిగ్మన్డ్ ఫ్రాయిడ్ (**Sigmund Freud**) చూసి ప్రభావితుడయ్యాడు. "మూడు నుండి ఏడు సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న పిల్లల మానసిక వికాసపు సమయంలో ఆడ పిల్లలు తండ్రిని, మగ పిల్లలు తల్లిని లైంగిక దృష్టితో చూసి వారిని తమ జీవిత భాగస్వాములుగా చేసుకోవాలని కోరుకుంటారు" అనే విప్లవాత్మకమైన వాదాన్ని ప్రవేశపెట్టేడు. "అమ్మే అందరిలోకీ అందమైనది, మంచిది, ఉన్నతమైనది అనే భావం కొడుకుకి ఉండడం సహజం. కాని పిన్న వయస్సులో ఆ భావం ప్రేమగా మారినప్పుడు కొడుకుకీ, తండ్రికి మధ్య ఒక రకం వైరభావం ఏర్పడుతుంది" అంటారు ఫ్రాయిడ్. అప్పుడు ఆ తండ్రి "ఈమె నాది, నువ్వు నీ ఈడుకి సరిపోయే జోడీని మరొకరిని చూసుకో" అనే పరిష్కార మార్గం చూపిస్తాడు. ఈ రకం మానసిక సంక్షోభానికే ఫ్రాయిడ్ "ఎడిపస్ కాంప్లెక్స్" అని పేరు పెట్టేడు. ఈ రకం మానసిక సంక్షోభం మగ పిల్లలు తమ ఆడ "టీచర్ల" యెడల ప్రదర్శించడం మనం చూస్తూనే ఉంటాం. అమెరికాలో ఈ విషయాన్ని కథాంశంగా తీసుకుని **Andy Griffith Show** అనే TV కార్యక్రమంలో ఒక మనోహరమైన సన్నివేశం చూపేరు:

(50 వ పేజీ చూడండి)

# సప్త మోక్ష నగరాలు



**కొత్త రామానందం**

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పర- మావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపురుషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్ర- మాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైనప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహకరించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగ- వంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తాడు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుం- డి విముక్తి చేయడానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప్త నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్షదాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప్త మోక్ష నగరాలు మోక్షధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

**అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని) మరియు ద్వారక.**

# ఉజ్జయిని



ఆకాశంలో తారకేశ్వర లింగం, పాతాళంలో హటకేశ్వర లింగం మర్త్యలోకంలో (భూలోకంలో) మహాకాళ లింగం పూజనీయమైనవి. అందుకే ఉజ్జయిని లోని మహా కాళేశ్వరం నిత్యం దర్శించుకునేందుకు ముక్కోటి దేవతలు వస్తారని అంటారు. ఇంతటి మహిమాన్వితమైన ఉజ్జయిని నగరానికి 'అవంతిక' 'కుశస్థలి' -- 'భోగవతి' 'ప్రతి కల్ప' 'విశాల' 'పద్మావతి' 'అమరావతి' -- అనే పేర్లు ఉన్నాయి. త్రిపురాసుర సంహారంలో శివుడు మహాకాల తనంలో రక్త దంతికా చంద్రికను ఆరాధించి పాశుపతాస్త్రాన్ని పొంది శత్రువును ఉజ్జితుని చేయడం వల్ల ఈ పుణ్య క్షేత్రానికి 'ఉజ్జయిని' అనే పేరు స్థిరపడింది. ప్రాచీన కాలంలో అవంతికా నామంతో ప్రసిద్ధి చెందిన నేటి ఉజ్జయినీ సప్త మోక్ష పురాణాలలో ఒకటిగా విరాజిల్లుతుంది.

ఈ పుణ్య ధామం అశోకుని తండ్రి అయిన బింబిసారుని రాజ్యానికి అవంతిక రాజధాని అశోకుడు ఇచ్చటి వడ్డీ వ్యాపార్తైనే వివాహమాడాడు. స్వర్ణయుగ సృష్టి కర్తలుగా ప్రసిద్ధి చెందిన గుప్తరాజులలోముఖ్యుడైన రెండవ చంద్ర గుప్తుడు తన రాజధాని పాటలీ పుత్రం (పాట్నా) నుంచి అవంతికకు మర్చాడు. మేఘ సందేశ కావ్యయంలో కాళిదాసు కవి అవంతికా నగర వైభవాన్ని వర్ణించాడు. పిమ్మటి ఈ నగర వైభవాన్ని కాలంలో మహమ్మదీయులు ఈ నగర సంపదను కొల్లగొట్టి దేవాలయాలను ధ్వంసం చేశారు.

క్రీస్తు శకము 1750 సం || నుంచి ఉజ్జయిని సింధియా రాజుల వశమయ్యింది. 1810లో సింధియా రాజు తమ రాజధానిని ఉజ్జయిని నుండి గ్వాలియర్ కు తరలించారు. అప్పటి నుంచి ఉజ్జయిని రాజకీయ ప్రాముఖ్యం తగ్గింది. స్కాంద పురాణం ప్రకారం ఉజ్జయిని అంటే 'విజేత' అని అర్థం. ఇక్కడ త్రిపురాసురునిపై విజయం సాధించాడు కనుక ఈ పట్టణానికి

'ఉజ్జయిని 'అనే పేరు వచ్చినట్టు ఈ పురాణం చెబుతోంది. మిగతా శివ క్షేత్రాలకు ఉజ్జయినికి మధ్య ఒక తేడా ఉంది. ఏ ఒక్క శివ క్షేత్రం లో స్మశానం, ఎడారి , పొలం,పీఠం, అరణ్యం అన్నీ కలిసి ఉండవు. కానీ ఉజ్జయినీ క్షేత్రంలో అన్నీ కలిసి ఉన్నాయి. అందుకే ఈ క్షేత్రానికి అంత మంచి పేరు వచ్చింది. ఇక్కడ వెలసిన మహా కాళేశ్వరును దర్శించుకుంటే కోరుకున్న కోరికలన్నీ నెరవేరుతాయంటారు. ఇక్కడ స్వామి జ్యోతిర్లింగ స్వరూపునిగా ఆవిర్భవించడం వెనుక ఒక కథ ఉంది.




పూర్వం ఉజ్జయినిలో వేద ప్రియుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. వేద పండితుడిగా వేద క్రతువులు ఆచరించే వానిగా మంచి పేరును సంపాదించుకున్నాడు. అతనికి నలుగురు కుమారులున్నారు. వారు 1. దేవ ప్రియుడు 2. ప్రియా మేఘుడు 3. సుకృతుడు 4. సువ్రతుడు. తండ్రి అనుసరించిన రీతిగానే అతని పుత్రులు నిత్యం వేదాధ్యయనం చేస్తూ వచ్చిన అతిధి అభ్యాగతులను ఆదరిస్తూ పవిత్రంగా ఉండేవారు. పట్టణవాసులు ఈ కుటుంబ సభ్యులపై అమితమైన గౌరవం ప్రదర్శించేవారు. ఆ పర్వతంలో దూషణుడు అనే రాక్షసుడు ఉండేవాడు. ఆతను బ్రహ్మ





దేవుని మెప్పించి వరాలు పొంది అహంకార గర్వంతో పట్టణాలు, గ్రామాలపై పడి పీడించేవాడు. ఒకనాడు ఆ రాక్షసుడు ఉజ్జయిని లోని వేద ప్రియుని ఇంటిలోనికి ప్రవేశించి అక్కడ పూజా కార్యక్రమాలన్నిటినీ భగ్నం చేసాడు. వేద ప్రియుని చంపుటకు సిద్ధమయ్యాడు. రాక్షసుడు నగరంలో ప్రవేశించినట్లు తెలియగానే వేద ప్రియుడు ఒక పార్థివ లింగాన్ని తయారుచేసి, భక్తి శ్రద్ధలతో శివారాధన ప్రారంభించాడు. శివారాధనతో ఉన్న వేద ప్రియునిపై రాక్షసుడు కత్తి ఎత్తాడు. వేదం ప్రియుడు పూజిస్తున్న పార్థివ లింగం నుంచి ఉద్భవించి తన త్రిశూలంతో యాషణుని హతమార్చాడు. వెంటనే వేద ప్రియుడు పరమేశ్వరుని కి నమస్కరించగా, శివుడు ఆ బ్రాహ్మణుని వరం కోరుకోమన్నాడు. ఆ 'బ్రాహ్మణుడు' పరమేశ్వరా! తమరు ఉజ్జయిని లోనే ఉండి, ప్రజలందరినీ అకాల మృత్యువు బారి నుండి కాపాడమని రక్షించమని కోరుకున్నాడు. వేద ప్రియుని ఇంట జ్యోతిర్లింగ రూపంతో అవతరించాడు. భీత రూపంతో రాక్షసుని హత మార్చాడు కనుక ఇక్కడ వెలసిన శివునికి 'మహా కాళేశ్వరుడు ' అనే పేరు వచ్చింది. వేద ప్రియుని గృహమే తరువాత కాలంలో దేవాలయంగా నిర్మితమయింది.

మహా కాళేశ్వర లింగం జ్యోతిర్లింగాలలో దక్షిణ ముఖంగా ఉంటుంది. త్రేతాయుగంలో రాముల వారు పితృదేవతలకు ఇక్కడనే పిండ ప్రదానం చేశారట. ఈ జ్యోతిర్లింగాన్ని స్మరించినా, ధ్యానించినా, దుఃఖ భయాలు తొలగిపోతాయని స్వయంగా సూతమహాముని సౌనకాది మహా మునులకు వివరించాడు.

ఈ మహా కాళేశ్వర లింగం విశాలమయిన ఆలయంలోని కింది అంతస్థులో విరాజిల్లుతున్నాడు. లింగం దర్శించడానికి కింది అంతస్తుకు మెట్లు దిగి వెళ్ళ వలసి ఉంటుంది.

దేవాలయాల ప్రాంగణం లోనే కోటి తీర్థ మనే కోనేరు ఉంటుంది. ఈ కోనేరు తీర్థంతో భక్తులు స్వామి వారిని భక్తి శ్రద్ధలతో అభిషేకం చేకుంటూ ఉంటారు. అందరూ స్వ హస్తాలతో లింగాన్ని స్పృశించ వచ్చును. ప్రతీ రోజూ 4. 30 ని. లకు సూర్యోదయానికి ముందే జరపబడే చితా భస్మాభిషేకం సుమారు 90 ని || ల పాటు జరుపుతారు. ఈ చితా భస్మాభిషేకం చూచుటకు కొంత మందే అనుమతించబడతారు. ఆన్ లైన్ లో దర్శనానికి భక్తులు అనుమతి పొందవచ్చును. చితా భస్మాభిషేకాన్ని పూజారులు స్త్రీలను చూడనివ్వరు. తమ చీర కొంగును ముఖంపై కప్పుకోవలసి ఉంటుంది. చితా భస్మాభిషేక సందర్శనం ఒక దివ్యానుభూతిగా మిగిలిపోతుంది.

జ్యోతిర్లింగ ప్రాంగణంలోనే, పై అంతస్థులో నాగ చంద్రేశ్వర దేవాలయం వుంది. ఆ ఆలయాన్ని నాగపంచమి రోజునే తెరిచి




ఉంచుతారు. మిగతా రోజుల్లో గర్భాలయ ద్వారాలు మూసి ఉంటాయి.

ఉజ్జయినీ మహా కాళేశ్వర దేవాలయం కాకుండా దర్శనీయ స్థలాలు చాలా ఉన్నాయి. వీటిని చూడటానికి భక్తులు ఆటోలలో కానీ, బస్సులో కానీ వెళ్లవచ్చును.

**1. మహాకాళీ ఆలయం:**

ఇక్కడి మహాకాళికా ఆలయం అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటిగా పరిగణిస్తారు. సతీదేవి మోచేయి ఇక్కడ పడిందంటారు. ఉజ్జయినిలో జ్యోతిర్లింగం, శక్తిపీఠం




రెండూ ఉండటం ఒక విశేషం. అందువెళ్లే ఈ క్షేత్రం గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది. ఈ శక్తి దేవతను మహంకాళి, మహాకాళి, గల్ కాళి అని పిలుస్తారు. పార్వతీదేవియే ఇక్కడ మహంకాళి రూపాన్ని దాల్చిందంటారు.

మహంకాళి ఉగ్రరూపిణి. ఎనిమిది చేతులతో కనిపిస్తుంది. ప్రతి చేతిలో ఒక్కో ఆయుధంతో దర్శనమిస్తుంది. దుష్టుల్ని శిక్షించి, శిష్టుల్ని రక్షించే మాత మహాకాళి అనే సందేశాన్ని ఆమె రూపంలో గ్రహించవచ్చును. ఈ ఆలయం మహాకాళేశ్వర ఆలయానికి సుమారు 5 కిమీ దూరంలో ఉంటుంది. ఈ అమ్మవారి కృప వల్లనే నిరక్షరాస్యుడైన కాళిదాసు గొప్పకవిగా మారాడు. ఇక్కడ మూలవిరాట్ తోపాటు మహాలక్ష్మి, సరస్వతి ఇతర దేవతల విగ్రహాలు కూడా ఉన్నాయి. తాంత్రిక శక్తులు పొందాలనుకునేవారు ఈ దేవాలయంలో తాంత్రిక పూజలు చేస్తారు. ఈ దేవాలయానికి వెనుక వైపున ఉన్న ఒక ప్రాచీన గణపతి దేవాలయాన్ని కూడా మనం దర్శించవచ్చును.

**2. కాలభైరవ ఆలయం:**

రైల్వే స్టేషన్ కు సుమారు 5 కిమీ దూరంలో ఉన్న ఈ ఆలయం అతి ప్రాచీనమైన ఆలయం.

(ఇంకా వుంది)

# నూటపదహార్లు కందాల్లో
# సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అధ్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం. ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముళ్ళి, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశంచి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా పాలెపు బుచ్చిరాజు

81) ఎల్లెడ వెదకిన గానక
తల్లడపడి పైకి జూచె తరుశాఖలలో
అల్లన పాడుచు మారుతి
మెల్లగ దుమికెను తనకథ మేలుగ చెప్పెన్

81. ఎవరిదా ఈ పాట? అని వెదుకుతూ చెట్టుకొమ్మల పైకి చూసింది. అక్కడ భక్తి తన్మయత్వంతో రామ కథ పాడుతున్న మారుతిని చూసింది. వెంటనే మారుతి క్రిందికి దూకి, సీతామాత పాదాలకి నమస్కరించి. నిలబడ్డాడు.

82)బాలార్కుని బోలు ముఖము
ఆలాగున పాడ గలుగు నాతడు మహిలో
ఏలాగున రక్కసుడగు
నా లావరి నిజము రాముడంపిన కపియే

82. జానకి ఆ ఉదయభానుని వంటి ముఖవర్చస్సుని, ఆ పాడిన విధానాన్ని చూసి, రాక్షసులెవరూ ఇంత గొప్పవిద్యని ప్రదర్శించలేరు. కనుక ఈ వచ్చిన కపీశ్వరుడు తప్పకుండా రాముడు పంపిన భటుడే అని నిశ్చయించుకుంది.

83)ఆ వినయమట్టి పలుకులు
పావన హృదయము నడవడి బాగుగ తెలిసెన్
కేవలము నన్నుతీసుకు
పోవగ వచ్చెనని సీత పూర్తిగ నమ్మెన్

83. ఆయన వినయము, భక్తి భావము, నడవడిని బట్టి, తన చెర విడిపించడానికి వచ్చిన వాడే ఈ మహాత్ముడు అని తలచింది.

84) ఇంతగ చింతించ తగదు
ఎంతటి వాడైన రాముడెందులకిచ్చున్
సుంతయు సందియమున్నను
అంతటి విలువైన ముద్రికా కపివరుకున్

84. ఇంకా శ్రీరాముడికి ప్రియాతి ప్రియమైన ఉంగరాన్ని చూసి, ఎంత నమ్మకస్తుడు కాకపోతే దీన్ని చేతి-కిస్తాడు రాముడు. అని ఆలోచించి, అనుమానాలన్నీ పక్కన పెట్టింది జానకి.

85) అమ్మా! పవన కుమారుడ
రమ్మా! నా భుజములెక్కి రాణించంగా
ముమ్మూర్తులడ్డ మైనను
పొమ్మంచు నభమున సాగి పోయెదనమ్మా!

85. అప్పుడు హనుమంతుడు "అమ్మా! నేను వాయుదేవుడి కుమారుడిని, వాయువేగ మనో వేగాలతో, ఆకాశంలో ఎగుర గలను. సందేహించ కుండా నువ్వు నా భుజాలమీద కూర్చో. త్రిమూర్తులడ్డమైనా సరే ఓడించి, నిన్ను క్షణాల్లో నా స్వామి రాముడి దగ్గరకి చేరుస్తాను" అన్నాడు.

86) అంతటి వాడవె వీరుడ
కాంతను భయభీతితోడ గగ్గోలిడనే!
ఇంతకు నా రామచంద్రు డేతెంచ వలెన్
అంతము చేయ సురవైరి నప్పుడె వత్తున్

86. అప్పుడు సీత "వీరుడా! నిన్ను చూడగానే నాకా నమ్మకం కలిగింది. కాని స్త్రీని, నీ వేగానికి భయపడి నేను బెంబేలెత్తి పోవచ్చును. అంతేకాదు. నా రాముడు రావాలి. ఆ రావణుడిని కడ తేర్చాలి, అప్పుడు కాని నాకు తృప్తి కలగదు. " అంది.

87) క్షుద్రుడు రావణు లంకను
నిద్రాహారములు మాని నీకై వేచెన్
భద్రముగ రమ్ము భద్రుడ
రుద్రుడవై వైరి జంపు రోషము తోడన్

87. దయ చేసి నువ్వు త్వరగా తిరిగి వెళ్లి "ఆ దుష్టుడి లంకలో నిద్రాహారాలు మాని సీత నీ కోసం తపిస్తోందని చెప్పి పుణ్యం కట్టుకో.

88) అని రామునితో చెప్పుము
హనుమా! యిప్పుడె వెడలుము అవనిజ కొరకై
కనలేదా నా హింసలు
వినలేదా వాని గడువు వేగమె పొమ్మా!

88. ఇంక ఆలస్యంచేయకుండా వెంటనే వెళ్ళు. విన్నావు కదా! వాడిచ్చిన గడువు. అంతా చెప్పు.

# ఏక్ భారత్ ` శ్రేష్ఠ భారత్ సాధనలో విద్యా విధానం యొక్క పాత్ర



ఆచార్య మత్స్యరాజ హరగోపాల్

(గత సంచిక తరువాయి)

భారతీయ భాషలన్నింటితో-పాటు సంస్కృతభాషకు కూడా ప్రాధాన్యం ఇవ్వబడిరది కాబట్టి ప్రాచీనభారతచరిత్ర, సంస్కృతీ, సంప్రదాయాలతోపాటు అలనాటి వాఙ్మయ పఠనం ద్వారా మన భారతీయ ధర్మ ప్రాశస్త్యాన్ని తెలుసుకోగలం.

5. కాన్సెప్ట్ (Concept) / ఫార్ములా (Formula) బట్టీ విధానం కాకుండా (Rote Learning) అప్లికేషన్స్ (Practicals) ని ప్రోత్సహించడం, బట్టీ విధానానికి స్వస్తిపలికి పాఠ్యాంశాలు (Curricular), పాఠ్యేతర అంశాలు (Extra Curricular Activites) వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్స్‌లో నైపుణ్యం నూతన విద్యావిధానంలో ఉన్నాయి.

6. మార్కులు, ర్యాంకుల వెంబడి, విద్యార్థులు పరుగెత్తకుండా ప్రతిభ ద్వారా (అంటే విద్యార్థి సర్వతోభివృద్ధి) జరగాలి. నాణ్యమైన విద్య ద్వారా ఇది సాధ్యపడుతుంది.

ఏ భాషలో అయితే మన పిల్లలు (ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు) శాస్త్రీయ విషయాలు నేర్చుకొంటారో, అర్థం చేసుకుంటారో అదే (మాతృ) భాష లో బోధన జరగాలి.

7. పూర్వ పాఠశాల (Pre School)స్థాయినుంచే, బలమైన పునాదులు వేయాలనే భావనతో 10G2 విద్యావిధానం స్థానంలో 5G3G3G4 వ్యవస్థవల్ల "చదవడం కోసం నేర్చుకోవడం కాకుండా నేర్చుకోవడం కోసం చదువుకోవడం" అన్న దిశగా నేటి విద్యార్థులను, అధునాతన కాలానికి అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తూ ముందుకు తీసుకెళ్లాలని, ఇటీవల మన ప్రధాని శ్రీ నరేంద్రమోదిగారు తమ ప్రసంగంలో వివరించడం జరిగింది.

8. అందరికీ విద్య (Access to Every body)పౌరులందరికీ సమాన విద్య అవకాశాలు (Equal Opportunites) కెజీ నుండి 12వ తరగతివరకు అవసరమైనంతమేరకు పాఠ్యాంశాల మదింపు, వృత్తి విద్యానైపుణ్యాలకు, నిత్యజీవితంలో అవసరమయ్యే ప్రయోగాత్మకమైన విద్యాబోధన, ప్రాథమిక స్థాయిలలో నుంచి అనుభవ పూర్వక విజ్ఞానాన్ని జోడిరచడం ఈ విద్యావిధానంలో ఉన్నాయి.

9. జాతీయ స్థాయిలో పరీక్షల నిర్వహణ (National Testing Agency)ద్వారానే జరిగి, ఉద్యోగ రంగంలోనే ఈ విధానాన్నీ అవలంభించడంవల్ల విద్యార్థులకు, ఉద్యోగార్థులకు శ్రమ, ఒత్తిడి తగ్గుతాయి.

10. అధ్యాపక వృత్తి కూడా గౌరవ ప్రదమైన వృత్తిగా పరిగణింపబడుతూ, ప్రతి ఉపాధ్యాయుడు ఉపాధ్యాయ శిక్షణ పొందడం, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలలోనూ బి.ఇడి, డిగ్రీ ఉండడం తప్పనిసరి. అందువల్ల విద్యా ప్రమాణాలు పెరిగేందుకు ఈ

విధానంలో 'శిక్షణ' తప్పనిసరి చేశారు. ఉన్నత స్థాయిలో పరిశోధన జరగడానికి ప్రస్తుతమున్న M.Phil విధానానికి ఉద్వాసన పలికి Ph.D కి మార్గం సులభం చేస్తూ ఇంటిగ్రేటేడ్ డిగ్రీ ప్రాధాన్యతను పెంచడంవల్ల నాణ్యమైన పరిశోధనకు, అధ్యాపక వృత్తిపై నిజంగా మమకారం ఉన్నవారికి ప్రోత్సాహం ఇవ్వబడిరది.

వివరణాత్మక చర్చ

### 1. పాఠశాల విద్యావిధానంలో ముఖ్య మార్పులు

విద్యాహక్కు (Right to Education) ఇంతకుపూర్వం 6`14 సంవత్సరాల బాలబాలికలకుండేది. అది ప్రస్తుతం 3`18 సంవత్సరాల విద్యార్థులకు మార్పు చేయడం సంతోషకరమైన విషయం. తద్వారా దేశంలోని పాఠశాల విద్యారంగంలో గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనివారు చేరే అవకాశమున్నది. అందుకుగాను అంగనవాడిÑ ప్రీప్రైమరీ సెంటర్లలో తగిన విధంగా విద్యాలయ భవనాలను (Infrastructure) అధ్యాపకులను నియమించాల్సి వస్తుంది. ఆయా తరగతుల విద్యార్థులకు తగిన విధంగా జాతీయ స్థాయిలో పాఠ్య ప్రణాళిక సిద్ధం కావాల్సి ఉంది.

అయితే 2020 విద్యావిధానంలో 'సర్వశిక్షా అభియాన్' (అందరికీ విద్య) చేర్చడం సంతోషకరమైన విషయం. ఇందుకుగాను సమాజము, అధ్యాపకులు, సమాజంలోని వివిధ రంగాల నిపుణుల సహకారం తీసుకోవడంవల్ల పాఠశాలల్లో విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేయకుండా నిరోధించ గల్గుతాము.

నూతన విద్యావిధానంలో మాతృభాషలో బోధన ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పడం జరిగింది. కనీసం 5వ తరగతివరకు 'మాతృభాషలో బోధన', తర్వాత 6`12 తరగతుల్లోనూ 'భాషా' ప్రాముఖ్యాన్ని వివరించడం, పాఠ్య ప్రణాళికలో చేర్చడం జరిగింది. భారత జాతీయ యోగ, వేదాంతం, ఆయుర్వేదం, నీతిశాస్త్రం లాంటి వాటిని పాఠ్యప్రణాళికలో చేర్చడం జరుగుతుంది. తద్వారా 'విద్యార్థి' సర్వతోభివృద్ధికి జరగడానికి అవకాశాలున్నాయి. తద్వారా జాతీయ స్థాయిలో పాఠశాల విద్యా పాఠ్యప్రణాళిక ఏర్పాటు చేయడంవల్ల 'ఏకభారత్` శ్రేష్ఠ భారత్'ను సాక్షాత్కరించే వీలు కల్గుతుంది.

విద్యార్థి ప్రతిభకు 'కొలమానానికి' 3,5,8వ తరగతుల్లో స్థానికంగా పరీక్ష నిర్వహింపబడుతుంది. 10, 12వ తరగతుల్లో రాష్ట్ర స్థాయి పరీక్షల నిర్వహణ, విద్యార్థుల అభిరుచికి తగినట్లుగా సబ్జెక్ట్‌ల ఎంపిక, ఫార్మటివ్ అసెస్మెంట్ టెస్టులు (Formative Assessment Test)నూతన విద్యావిధానం (NEEP20) లో చేర్చబడ్డాయి. ఇందుకుగాను PARAKH (Performance Assessment, Review and Analysis of Knowledge for Holistic Development), NTA ((National Testing Agency) లు జాతీయ స్థాయిలో ఏర్పడుతాయి.

ఆంగ్ల మాధ్యమాన్ని ఒక సామాజిక అంశముగా కొందరు పరిగణిస్తున్నారు. బలహీనవర్గాలకు ఆంగ్ల మాధ్యమము దూరమవుతున్నదని...ఇది సామాజిక దుర్విచక్షణ అని, ధనిక వర్గాల పిల్లలు, ఉన్నత విద్యావంతుల పిల్లలు ఆంగ్ల మాధ్యమాలలో చదువుకొను చుండగా, నిమ్న వర్గాల పేదలు, గ్రామీణ ప్రజలు తమ పిల్లల్ని, తెలుగు మాధ్యమంలోనే ఎందుకు చదివించాలనే ప్రశ్న తలెత్తుతోంది.

మాతృభాషా పరిరక్షణ కేవలము

పేద వారిదేనాÑ ఆంగ్ల భాష సంపన్నవర్గాల ఆధిపత్య చిహ్నమాÑ అనే ప్రశ్నలు ఉత్పన్నవుతున్నాయి.

జనాలలో ఒక దురవగాహన ప్రబలంగా ఉన్నది. ఆంగ్ల మాధ్యమము సర్వరోగనివారిణి అని, అన్నము పెట్టనిది తల్లి భాష అయినా ఎందుకు అని.

మరి కొందరు ఇంట్లో మాట్లాడేది తెలుగే కదా, ఆ భాషలోనే చదువెందుకనీ ఆలోచిస్తున్నారు. మాతృభాష వినియోగము వెనుకబాటుతనానికి గుర్తని, ఇటువంటి ఆలోచనలే మాతృ భాష వెనుకబాటునకు, సంకేతమనే భావన కూడా దురదృష్ట కరము.

ఆంగ్ల భాషనే నవ నాగరికతకు, మేధా శక్తికి చిహ్న మనేది కూడా తప్పుడు అభిప్రాయమే.

ప్రపంచములో ఆంగ్లేతర భాషా దేశస్థులు కూడా విజ్ఞాన శాస్త్రములోనే గాకుండా ఇతర రంగాలలో కూడా ముందంజలో ఉన్నారు.

పైన పేర్కొన్న ఆలోచనలకు, ఉదాహరణలకు మాతృ భాషేతర వర్గాలు జవాబు చెప్పాలి.

పసి ప్రాయంలో శాస్త్ర విషయాలను తనది కాని భాష ద్వారా మెదడులోకి బలవంతంగా పంపించాలన్న ఆలోచన అశాస్త్రీయమైనది.

ప్రభుత్వాలు, ఇతర పాఠశాలల యాజమాన్యాలు, పట్టణాలు, నగరాలలో ఉన్న ఉన్నత పాఠశాలలలోను రెండు మాధ్యమాలలోను భోధన సాగించవచ్చును.

మారుమూల గ్రామీణప్రాంతాలలోని పిల్లలకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉపకరించదు సరికదా ఇబ్బందులను తెచ్చి పెడ్తుంది.

ఆంగ్లములో ప్రావీణ్యము కావాలంటే మాధ్యమిక (Middle School) మరియు ఉన్నత (High School) స్థాయిలో ఆంగ్లమును పటిష్టంగా నేర్పించాలి. అంతే తప్ప ప్రాథమిక పాఠశాల స్థాయిలో విజ్ఞాన, సామాజిక శాస్త్రాలు, గణితము ఆంగ్ల మాధ్యమంలో నేర్పడము వల్ల పిల్లల పరిస్థితి సంక్లిష్టంగా మారుతుంది.

నేటి విద్యార్థులు పోటీ పరీక్షలలో నెగ్గుకు రావాలన్నా, మౌఖిక పరీక్షలలో నిలదొక్కుకోవాలన్నా కేవలం ఆంగ్లం వస్తే చాలన్న అభిప్రాయము చాలా తప్పు.

విద్యార్థికి తాను చదువుకున్న బోధనాంశములపై సమగ్రమైన పరిజ్ఞానము అవసరము.

మరియొక విషయము..

ప్రపంచములో ఏ దేశము కూడా తన దేశ భాషలో (మాతృ భాష) విద్యా బోధనను రద్దు చేయలేదు.

'శిశు విద్య' : 3`6 ఏళ్ల వయసులో చిన్నారుల వయస్సులో వేగంగా ఆకళింపు చేసుకోగల చురుకుతనం (ప్రస్తుత 'కోవిడ్' పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ చిన్నారులలోని ప్రతిభకు సాన పట్టాలి), ఉన్న విషయాన్ని గుర్తించి NEP2020 పూర్వ పాఠశాల (Pre School) విద్యకు పెద్ద పీట వేసింది.

కమిటీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరీ రంగన్ మాటల్లో "చిన్నారుల్లో 85 శాతం మెదడు వృద్ధి మొదటి ఆరు సంవత్సరాల వయస్సులోనే ఉంటుంది. ఈ వయస్సులో మెదడు ఎక్కువ అంశాలను వేగంగా ఆకళింపు చేసుకోగలుగుతుంది. కొత్త భాషలు నేర్చుకునే సామర్థ్యం కూడా ఎక్కువే. అందుకే ఈ వయసు పిల్లలందరికి నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించడం తప్పనిసరి. అందుకే శిశు విద్యకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లోనూ మూడేళ్ళపాటు పూర్వ ప్రాథమిక విద్య (Pre School) ను ప్రవేశపెడుతున్నాం". న్యూరోసైన్స్ నిపుణులు సహా పలు అధ్యయనాలూ ఈ విషయాన్ని ధృవీకరించాయి.

శిశుప్రాయం నుంచే కేవలం నేడు చూస్తున్న ఏక దుస్తుల సామ్యత కాకుండా ఏకరూప సామ్యత అంటే, విద్యార్థులందరూ సమానులే అన్న భావన కల్గించే విద్యావిధానం కావాలి. మన పూర్వకాలపు గురుకులాలలో ఈ సమానత్వం బలంగా ఉండేది. పేద, ధనిక విద్యార్థుల మధ్య మిత్రత్వముండేది. ఆనాటి 'విద్య' దానికి దోహదం చేసింది. శ్రీ మద్భాగవతం లోని శ్రీకృష్ణ ` కుచేలోపాఖ్యానము ఇందుకు నిదర్శనం `చిన్న నాటి స్నేహితుడైన సుదాముడు కుచేలుడుగా అంటే మహా దరిద్రుడుగా ఉన్నప్పుడు, ఒకసారి తన బాల్యమిత్రుడైన శ్రీకృష్ణుని వద్దకు వెళ్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు మహా భక్తిపూర్వకంగా ప్రేమతో తన బాల్య స్నేహితుడ్ని ఆదరించి సత్కరిస్తాడు. శ్రీకృష్ణుడు ` సుదామ ఒకే గురువు వద్ద విద్యాభ్యాసం చేశారు. (సాందీపని గురు ఆశ్రమంలో). ఈ ఉదంతం మన నేటి విద్యాలయాలు ఎలా ఉండాలో, తరతమ భేదాలు విద్యాలయాల్లో ఉండరాదని ప్రబోధిస్తుంది. అందుకే 'అమెరికా' లాంటి సంపన్న దేశాల్లో కూడా ఒక 'కౌంటీ' అంటే ప్రాంతం విద్యార్థులంతా అదే 'కౌంటి'లోని పాఠశాలల్లో చదువుకోవాలనే నిబంధన ఉంది. మన దేశంలో ముఖ్యంగా విద్య ప్రభుత్వ పరమైతేనే ఇది సాధ్యం. నేడు ప్రైవేటు' పేరుతో 'విద్య' 'వైద్యం' ధనార్జన కేంద్రాలుగా మారడం దురదృష్టకరమైన విషయం. కాని నేటి విద్యావిధానం 'ధనమూల మిదం జగత్' అనే తత్వానికి ఆజ్యం పోస్తుంది.

NEP020 దీనికి కళ్ళెం వేస్తుందని ఆశిస్తూ, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ విధానపరంగా దేశమంతటా ఒకే విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం, పాఠ్యప్రణాళికా అధ్యాపకుల నియామకం లాంటివన్నీ దేశ వ్యాప్తంగా ఒకే విధానంలో జరిగేందుకు కూడా నేటి NEP2020 ఉపయోగపడుతుంది.

అలాగే ఆయా రాష్ట్రాల్లో అక్కడి ప్రాంతీయ గొప్పతనాన్ని, వైభవాన్ని ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో విద్యార్థులకు తెలుపడం అవసరం. ఉదాహరణకు తెలుగు రాష్ట్రల్లో వేమన శతకం, సుమతి శతకం లాంటి 'నీతి' శతకాలను పిల్లలకు నేర్పాలి. రామాయణ, భారతాది ఇతిహాసాల ద్వారా 'నైతిక' బోధన జరగాలి.

పాఠశాల విద్య పర్యవేక్షణకు కేంద్ర విద్యాశాఖ మార్గదర్శకాలు (కమాండ్ సెంటర్) ముఖ్యాంశాలు

ప్రతి రాష్ట్రం, సమస్యలు చెప్పుకోవడానికి హెల్ప్‌లైన్ అందుబాటులోకి తేవాలి, డిజిటల్ పాఠాలు వినే వీల్లేని వారికోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి

కొవిడ్ పరిస్థితుల నేపథ్యంలో గత ఏడాది అందరికీ సమాన విద్య అందలేదని భావిస్తున్న కేంద్రం ఈసారి పకడ్బందీ పర్యవేక్షణకు నడుం బిగించింది. వచ్చే విద్యా సంవత్సరం (2021`22) లో ప్రతి విద్యార్థికి విద్యను అందించేందుకు అవసరమని నొక్కి చెప్పింది. వెంటనే కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్ (సీసీసీ)ను ఏర్పాటు చేయాలని కేంద్ర విద్యాశాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. అందులో విద్యావేత్తలు, ఇతర విద్యాపరమైన సమస్యలను పరిష్కరించే అధికారులను నియమించాలని మార్గదర్శనం చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో బడి మానేసే వారి సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేసిన కేంద్రం. జూన్ 30వ తేదీ వరకు సర్వే నిర్వహించి బడికి రాని వారిని గుర్తించి విద్యనందించాలని కోరింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఉపాధ్యా-

యులు కీలకపాత్ర వహించాల్సి ఉంటుందని అభిప్రాయపడిరది. అభ్యసన నష్టాన్ని పూడ్చేందుకు, విద్యార్థి ఇంటివద్ద చదువుకునేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించేలా చొరవ చూపాలని స్పష్టం చేసింది.

కమాండ్ సెంటర్ ఏర్పాటు లక్ష్యమిదీ...

పాఠశాలల్లో చేరిన / చేరని విద్యార్థులు, డ్రాపౌట్లు, బాలకార్మికులకు సంబంధించిన సమాచారం, పాఠ్య పుస్తకాల సరఫరా, ఉపాధ్యాయుల అందుబాటు. పాఠశాలల అవసరాలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సీసీసీ నుంచి పర్యవేక్షణ ఉంటుంది. బడుల అవసరాలు, మెరుగైన బోధన అందించడంలో ఎదురయ్యే సమస్యలకు నిపుణులు పరిష్కారం చూపే వీలుంటుంది. ఇక్కడుండే విద్యావేత్తలు ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు జారీ చేయచ్చు.

ఇంకా ఏమేం చేయాలంటే...

` విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ సందేహాలను, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చేందుకు, వాటికి పరిష్కారం చూపేందుకు అనువుగా హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రారంభించాలి.

` పాఠశాలలు, గ్రామాలవారీగా విద్యార్థుల హాజరు పట్టిక (రిజిష్టర్)ను తయారుచేయాలి. అందుకు తల్లిదండ్రులు, గ్రామ పంచాయితీ, ఉపాధ్యాయులతో కమిటీలు నియమించాలి. పిల్లలు ఏం చేస్తున్నారో నిత్యం తెలుసుకోవాలి. పాఠ్య పుస్తకాలను అందించి టీవీలు, యాప్స్, వాట్సప్ ద్వారా బోధించే ఏర్పాటు చేయాలి.

ప్రతి 10 మంది పిల్లలను ఒక ఉపాధ్యాయుడు పర్యవేక్షించాలి. ఆ పిల్లల అభ్యసన సామర్థ్యాల బాధ్యత ఆయనదే. పిల్లలతో నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతూ వారికి అవసరమైన సూచనలు ఇవ్వాలి. వారి మానసిక స్థితిని అంచనావేస్తూ తగిన సలహాలు ఇవ్వాలి.

` డిజిటల్ పాఠాల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన దీక్ష పోర్టల్‌ను అన్ని రాష్ట్రాలు ఉపయోగించుకోవచ్చు.

` బడులు తెరవని పరిస్థితులు తలెత్తే పక్షంలో స్మార్ట్‌ఫోన్ / ల్యాప్‌ట్యాబ్ / ఇలాంటి ఉపకరణాలు లేని వారికి కూడా విద్య అందించే ప్రణాళిక ఉండాలి. గ్రామాల్లో చదువుకున్న యువతను వాలంటీర్లుగా నియమించుకుని చదువు చెప్పించాలి. స్వచ్ఛంద సంస్థలు, దాతల సాయం లేదా సీఎస్ఆర్ నిధులతో డిజిటల్ పాఠాలు వినేందుకు అవసరమైన పరికరాలు అందించేలా చూడాలి.

` టీవీల ద్వారా ప్రసారమయ్యే పాఠాలు వినలేని వారి కోసం వెబ్‌సైట్ రూపొందించాలి. ఆయా పాఠాలను అందులో నిక్షిప్తం చేయించి, అవసరమైనపుడు డౌన్‌లోడ్ చేసుకొని వినే సదుపాయం కల్పించాలి.

తద్వారా విద్య ద్వారా, ఏక్‌భారత్ ` శ్రేష్ఠ భారత్ ను సాధించాలి.

## 2. అధ్యాపకుల` వారి శిక్షణ

అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమం, అర్హతలు నిర్దేశించబడినాయి. నాల్గు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బి.ఇడి, డిగ్రీ కనీస అర్హతగా ఈ విద్యావిధానంలో నిర్దేశించడం సంతోషకరమైన విషయం. వీరు తరచుగా ట్రాన్స్‌పర్‌లకు గురికాకూడదని, ప్రతిభ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, సర్వీసులో ఉన్నవారికి శిక్షణా తరగతులను నిర్వహించి, ఆయా సబ్జెక్ట్‌లలో ఉపాధ్యాయులు కాలానుగుణంగా జరిగే మార్పులకు అనుగుణంగా బోధన జరపాలని

విద్యావిధానం గట్టిగా నొక్కి వక్కాణించడం ద్వారా అధ్యాపకులు తమ తమ సబ్జెక్టులలో నిష్ణాతులు కాగలరని ఆశిస్తుంది. ఇందువలన కేవలం 'బోధనారంగం'లో అభిరుచి ఉన్నవారు మాత్రమే అధ్యాపక వృత్తిని చేపడతారని, వారికి తగిన జీతభత్యాలు ఇవ్వడం జరుగుతుందని నూతన విద్యావిధానం తెలియజేస్తుంది.

బాలికలకు విద్యారంగంలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, వారికి అవకాశం కల్పించి పురుషులకు సమానంగా విద్యను అందించాలని స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్స్ (SEZS), కస్తూర్బా బాలికా విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయబడునని తెలుస్తుంది.

విద్యాలయాలు 'స్కూల్ కాంప్లెక్స్' విధానంలో 10`15 ఒక పాలనా యూనిట్‌గా ఏర్పరచి, ముఖ్యంగా గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల్లో బాలబాలికలకు 'విద్యాహక్కు' ద్వారా ఉచిత విద్య అందుబాటులోకి తేవాలని, ఇందుకుగాను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (SCMC), విద్యార్థులు వారి తల్లిదండ్రులను కమిటీలో భాగస్వాములను చేయాలని నిర్దేశించడం ద్వారా 'అక్షరాస్యత', తద్వారా గ్రామీణ ఆదివాసీ బాలబాలికలకు విద్యావకాశాలు మెరుగుపడతాయని ఆశిస్తున్నట్లు భావించడం కూడా నేటి జాతీయ పరిస్థితులలో అవసరమైనట్లు, అనుగుణంగా ఉందనడంలో సందేహం లేదు. కమిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించబడుతుంది.

విద్యావిధానంలో 'ప్రతిభకు' పెద్దపీట వేయాలి. నేడు 98 శాతం ఇంజనీర్లు అంతర్జాతీయంగా పోటీల్లో నెగ్గుకు రాలేదని, యంత్ర విద్య, వైద్యవిద్య, న్యాయవిద్య మొదలైన వృత్తి విద్యలో కూడా 'నాణ్యత' రావాలని నిపుణులు, విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు. NEP2020 లో అధ్యాపకులు సంవత్సరంలో కనీసం 50 గంటలు, వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్దేశించింది.(Quality improvement Programs for inservice Teachers) అంతేకాక అధ్యాపక శిక్షణ M.Ed, B.Ed లాంటి కోర్సులలో నాణ్యత, ప్రామాణికత, ప్రాక్టికల్ ఉండాలని విద్యావిధానం 2020లో చేర్చబడినది.

ప్రాచీన భారతదేశంలో చతుర్విధ పురుషార్థాలను (ధర్మ, అర్థ, కామ, మోక్షాలు) పునాది 'విద్య'గా పేర్కొనబడినది. అలనాటి నలందా, తక్షశిల లాంటి అంతర్జాతీయ స్థాయిలో విశ్వవిఖ్యాతమైన విద్యాలయాలకు నిలయమైన మన దేశంలో నేటి విశ్వవిద్యాలయాలెన్నో అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా 'విద్యాబోధన' స్థాయికి ఎదగలేకుండా ఉన్నాయి. కేవలం 'ఉద్యోగం కోసమే పట్టాలు (Degrees) పనికి వస్తున్నాయే తప్ప విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి సర్వతోముఖాభి వృద్ధికి, జీవితంలో జరిగే ఆటుపోటులకు తట్టుకునే ధైర్యాన్ని కల్గించడం లేదు. పరిశోధనారంగం కుదైలేంది. గణనీయమైన, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు జరగడం లేదు. దేశం నుంచి ప్రతిభ కల్గిన 'యువత' సంపన్న దేశాలకు తరలి వెళ్తున్నారు. బ్రేన్` డ్రేన్ (Brain-Drain) అనేది సమస్యగానే ఉంది. మన దేశంలో 'ప్రతిభ'కు స్థానం ఇవ్వకుండా విద్యారంగంలో కుల, మత, జాతి, ప్రాంతం, భాషల వారిగా ప్రాధాన్యత కల్పించడం బాధాకరం.

విద్యాలయాలలో అడ్మిషన్స్ మొదలు, అధ్యాపకుల నియామకాలు, ఉపకులపతుల నియామకాలన్నీ పాలకుల నీతితో ఓటు

బ్యాంక్‌గా మారడంవల్ల 'రాజకీయాలు' ప్రవేశించాయి. తద్వారా విద్యా ప్రమాణాలు పూర్తిగా దిగజారిపోయాయి. మన 'విద్యాలయాలన్నీ కేవలం మర యంత్రాలుగా మారి రాశి`వాసి లేని పట్టుభద్రులను తయారుచేసి సమాజంలోకి పంపడం జరుగుతుంది. అలాంటి యువత తమ వృత్తులను (Professions) బాధ్యాతాయుతంగా, పరిపూర్ణ నైపుణ్యతతో నిర్వహింపలేకపోతున్నారు. ఒకే మాటలో చెప్పాలంటే, పూర్తిగా భ్రష్టుపట్టిన నేటి విద్యావిధానానికి జాతీయ విద్యావిధానం 2020 దివ్య ఔషధంగా పని చేయాలంటే 'జాతి' సంపూర్ణ సహకారం అవసరం.

## 3. అధ్యాపకుడిగా నా అనుభవాలు :

36 ఏళ్ళ సుదీర్ఘ అనుభవాల ద్వారా విద్యావిధానం అమలులో సాధక బాధకాలు ఉంటాయని భావిస్తున్నాను. ఏ విధానమైన ఆయా రంగాలలోని స్టేక్ హోల్డర్స్ (Stake holders)పైన ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం పాలకులుÑ విద్యావేత్తలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు సమాజంలోని పౌరులంతా ఇందుకు తమ తమ సహాయ సహకారాలు అందజేయాల్సి ఉంటుంది. అప్పుడే జాతీయ విద్యావిధానం సఫలీకృతమై, అనుకొన్న ఫలితాలను ఇవ్వగల్గుతుంది.

36 ఏళ్ల విద్యారంగ అనుభవంతో, జాతీయ అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పనిచేయడంవల్ల నేను విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాను. ముఖ్యంగా అమెరికాలాంటి దేశాల్లో 'విద్య' (ముఖ్యంగా పాఠశాల విద్య) ప్రభుత్వమే పర్యవేక్షిస్తు 'స్టేట్‌స్కూల్స్'ను ప్రోత్సహించడమే కాక, విద్యార్థులందరికీ ఆ దేశ చరిత్ర ముఖ్యాంశంగా, కంపల్సరీ సబ్జెక్ట్‌గా రూపొందింది. ఇది నేను ప్రత్యక్షంగా గ్రహించిన విషయం. ఏ దేశమైన 'జాతీయత', దేశభక్తి, చరిత్ర, సంస్కృతీ, సాంప్రదాయాలకు పెద్దపేట వేసి 'విద్యాబోధన' చేయగల్గితే 'విద్యార్థులు' బాధ్యతాయుత భావిపౌరులుగా కాగలుగుతారు.

జాతీయ స్థాయిలో 'పరీక్షా విధానం', ఉన్నత విద్య ప్రవేశాలకు జరిగేవి కూడా ఏకరూపసామ్యతా ఉండాలి. జాతీయ స్థాయిలోకి దేశంలోని అన్ని జాతీయ స్థాయి I.I.T / I. I.M / I.I.SC, Medical Colleges (NEET) విద్యాలయాల్లో ఒకే పరీక్ష నిర్వహించి, ఎంపిక జరగడంవల్ల విద్యార్థుల్లో మళ్ళీ మళ్ళీ పరీక్షలు వ్రాయడమనే భారం తగ్గుతుంది. ఉదాహరణకు అమెరికాలో 'SAT SCORE' ద్వారా అన్ని ఉన్నత విద్యాలయాల ప్రవేశాలు జరుగుతాయి.

నేను ఆఫ్రికా, ఏషియాలోని కొన్ని కామన్‌వెల్త్ దేశాల్లో Common Wealth Countries)విద్యాబోధన చేసినపుడు అంతర్జాతీయంగా ఒకే పాఠ్యప్రణాళిక కల్గిన (Cambridge University Overseas Education and Examiniations Syndicate) పరీక్షా విధానంవల్ల విద్యార్థుల ప్రతిభను పరీక్షించి సర్టిఫికేట్స్ ఇవ్వడం జరిగింది. ఈ విద్యావిధానంలో (Cambridge 'A' level మరియు 'O' level) ప్రాక్టికల్‌గా ఆలోచించే విధానానికి ప్రోత్సాహమివ్వడం జరిగింది. అదేవిధంగా జెనీవా కేంద్రంగా గల IB (International Baccalaureate) విద్యావిధానంలో విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చు.

( ఇంకా వుంది )

# చిత్తమును వసంతీకరించిన సీతారామ శాస్త్రి



## రసరాజు

సినిమా పాటకు రంగు రుచి వాసనా అద్దిన ఆధునికులలో సీతారామ శాస్త్రి గారొకరు. అంతకు ముందే సాహిత్యంపై ఒక 'పట్టు' ఉండటం వలన శాస్త్రి గారికి గీత రచన సుగమమయింది. కావలసినంత పద సంపద, భావాన్ని వ్యక్తీకరించడంలో తగిన మెళకువలు ఉండడంతో ఇవన్నీ ఆయనను పల్లకీలో కూర్చోపెట్టాయి

ఏ పాట వ్రాసినా అది హృదయాన్ని తాకింది. పాట వ్రాయక పోతే బ్రతుకుతున్నట్లు అనిపించేది కాదు వారికి.



వారితో నాకు పరిచయం 1974 ఆ ప్రాంతంలో తాడేపల్లిగూడెం లో ఏర్పడింది. టెలిఫోన్ శాఖలో వారు, ఎలెక్ట్రిసిటీ శాఖలో నేను అక్కడే పని చేస్తూ ఉండేవాళ్ళం. కథా రచయిత మారేమండ సీతారామయ్య త్రివేణీ కోచింగ్ సెంటర్ లో శాస్త్రి గారు, నేను తరచు కవిత్వం విషయంలో కలుసుకునేవాళ్ళం అప్పుడు వారు 'భరణి' పేరుతో కవిత్వం వ్రాస్తూ ఉండేవారు.

ఆ తరువాత నేనూ సినీ రంగంలో గీత రచయితగా ప్రవేశించాక వారితో అనుబంధం మరింత ఇనుమడించింది.

మదరాసులో కోదండ పాణి థియేటర్లో 'అసెంబ్లీ రౌడీ' చిత్రానికి నేను వ్రాసిన పాట 'అందమైన వెన్నెలలోన ....ఆ.. ఉదయం రికార్డింగ్ జరుగుతోంది. ఆ చిత్రానికే మరో పాట వ్రాసిన సీతారామ శాస్త్రి గారూ అక్కడే ఉన్నారు. నా పాట రికార్డింగ్ అయిన తరువాత శాస్త్రిగారు నన్నెంతగానో అభిమానించి, వారి గ్రామంలో ఉన్న వారి గృహానికి తీసుకువెళ్లారు. 'ఈ సినిమాలో మా అందరికంటే రసరాజు గారు మంచి పాట వాసారు. మంచి భోజనం పెట్టు ... ' అంటూ వారి శ్రీమతికి చెప్పారు.. ఆ ఇల్లాలు భోజనాన్ని మాకు ఎంతో ఆదరంగా వెండి కంచంలో వడ్డించారు. ఆ ఆప్యాయత ఎప్పటికీ గుర్తుంటూనే

ఉంటుంది. అటు పిమ్మట కూడా నేను వారింట్లో మూడు సార్లు ఆతిథ్యాన్ని స్వీకరించాను. అదీ శాస్త్రిగారి సౌజన్యం.

నా పట్ల వారికున్న ఆదరణీయమైన సౌజన్యాన్ని ఇక్కడ ప్రస్తావించాలి.

'రౌడీ గారి పెళ్ళాం' సినిమాకు నేను పాట వ్రాస్తున్న సమయంలో శాస్త్రి గారు, నేను ఒకే కారులో ప్రయాణిస్తున్నాం. అప్పుడు వారు నన్నడిగారు 'సినిమాలో 'ఒకే పాట వ్రాస్తున్నా రేమిటని?'. అని "నాకేదో ఉద్యోగముంది. ఒక పాట చాలు. ఆర్థికంగా నేనేమీ ఆశించటం లేదు. ... మిగతా రచయితలకు ఇదే కదా ఆధారం. అందుకోసం మరో పాటను నేను కోరుకోవటం లేదు" అంటూ వారికి విన్నవించాను.

దానికి వారేమన్నారో ఇక్కడ గమనార్హం.

"ఒక పని చేయండి. మీరు రెండు పాటలు వ్రాసి ఒక పాట డబ్బులు తీసుకోండి. వాళ్ళు వ్రాసే ఒక పాటకే రెండు పాటల డబ్బులిప్పించండి..." ఇదీ వారిపట్ల గల అభిమానం.

ఓసారి దర్శకులు కృష్ణవంశీ గారికి పరిచయం చేస్తూ 'మంచి పెన్ను రసరాజు గారిది...' అన్నారు.

మరోసారి హత్తుకునేలా ఒక మాట అన్నారు. "రసరాజు గారూ! నన్నలా ఉంచండి. రేపు సాహిత్యపరంగా నిలబడే గీత రచయితలలో మీరూ, వెన్నెలకంటి గారూ ఉంటారు" అని.

సరే! ఉద్యోగాన్ని నమ్ముకోవటం వలన చిత్రసీమకు అంటిపెట్టుకుని ఉండలేకపోయాను. అదే చెప్పాను. పాడుతా తీయగా కార్యక్రమానికి నేను ముఖ్య అతిథిగా వెళ్ళినప్పుడు - బాలు గారితో.

అందరూ వేల సంఖ్యలో పాటలు వ్రాస్తే - నేను మాత్రం వ్రేళ్ళ సంఖ్యల్లో వ్రాసేనని. ఆయన నవ్వుకొన్నారు.

ఇంకొక విషయం గుర్తుకు వస్తోంది-

ఓసారి శాస్త్రి గారింట్లో ఇద్దరం కూర్చున్నాం. ఎవరో ఒక అమ్మాయి భద్రాచలం నుండి వచ్చి,"శాస్త్రి గారూ! మీరు ఇటీవల వ్రాసిన మంచి పాటను వినిపిస్తాను" అన్నది. వారు సరే! అన్నారు. ఆ పాట విన్నాక వారు నవ్వుకొంటూ ఆ అమ్మాయి వైపు చూస్తూ, "అమ్మాయీ! నువ్వు పాడిన ఈ అందమైన వెన్నెల పాట - ఇదిగో ఇక్కడ కూర్చున్న రసరాజు గారిదమ్మా! నాది కాదు" అంటూ నావైపు అభినందన పూర్వకంగా చూశారు.

ఇలా ఎన్నో వారితో గడిపిన మాధుర క్షణాలున్నాయి ఆ రోజుల్లో.

ఎన్ని శిఖర సదృశమైన పాటలు వ్రాసారో సిరివెన్నెల గారు! తలచుకుంటే రెండు అరచేతులూ దగ్గరవుతాయి.

'తెలవారలేదా స్వామీ!' అని వ్రాస్తే అన్నమయ్య తలుపు తీసుకుని వచ్చాడు. ఆ ఏడుకొండలవాడు నిజంగానే కనులు నులుముకుంటూ పైకి లేచాడు. వారు వ్యక్తి కాదు! జగమంత కుటుంబానికి పర్యాయపదం.

శాస్త్రీగారు తలకు స్నానం చేసి, తలను తుడుచుకునేవారు కాదేమో! నేను చూసిన సందర్భంలో ఆ తల చెమ్మగానే ఉండేది. అవును! ఆ పాటల్ని వ్రాసేటప్పుడు ఆవహించిన తల వేడి తగ్గాలంటే అలానే ఉండాలేమో శాస్త్రిగారి విషయంలో.

ఎప్పుడూ చెరగని నవ్వు వారిది. తాత్వికంగా ఎదిగిన మనీషి. పాటల పండితుడు. శాస్త్రిగారు చాలా దూరం వెళ్ళిపోయారు. కానీ సీతారామశాస్త్రి గారి పాటలు మన ముందే ఉండి మన చిత్తములను వసంతీకరిస్తున్నాయి.

# సేవా? సహాయమా!.



ఆదూరి హైమవతి

"తాతగారూ! సేవకూ, సహాయానికీ భేదమేంటీ? " అంటూ దగ్గర వచ్చి కూర్చున్నాడు మనవడు మాధవ్.

"మంచి అనుమానమే వచ్చింది కానీ, ముందునీకు ఆరెండు పదాల కూ అర్థం చెపుతాను. ఆతర్వాత నీవే ఏది ఏందో తెలుసుకో. సేవ అంటే పరిచర్య, శుశ్రూష, సహాయము అంటే చేదోడు, సహకారము అని అర్థం.

నీకు జరిగిన ఒక సంఘటన చెప్తాను,విను. రెండింటికీ తేడా నీకే తెలుస్తుంది" అంటూ చెప్పడం మొదలు పెట్టాడు తాత తారక రామయ్య.

- అనగా అనగా ఒక ఊర్లో సత్యారావు , సీతామహాలక్ష్మి అనే దంపతు లు ఉండేవారు. సత్యారావు కాస్త కోపిష్టి మాత్రమేకాక నోటిదురుసు మనిషి. మనసు మంచిదే కానీ మాటే మనస్సులను కష్టపెడుతుంది. ఆయన భార్య సీతామహాలక్ష్మి. నిజంగానే సీతమ్మ తల్లంత మంచి మనసు, మాట కూడా.

సత్యారావు ఒక క్లబ్బు వారితో కలసి ఊర్లో ఏదైనా సేవలు చేస్తూ ఉండేవాడు .ఒక రోజు వర్షానికి వచ్చిన వరదలకు అంతాకోల్పోయి న పేదల కాలనీకెళ్ళి బట్టలు, ఆహారపదార్థాలూ పంచే సేవ ఉందని బయల్దేరాడు. పాత బట్టలన్నీ క్లబ్బు వారంతా సేకరించారు.

అతడు గుమ్మందాటుతుంటే అక్కడ ఒక వృద్ధుడు ఇంటి ముందు న్న అరుగుమీద స్పృహలేనట్లు గోడకు ఆనుకుని వాలిపోయి, సగం మూసుకున్న కళ్ళతో కూర్చునున్నాడు నిస్త్రాణగా. బయటికి వచ్చిన సత్యా రావును చూసి , చేత్తో నోరుచూపుతూ పొట్టచూపాడు. మాట్లాడే శక్తి కూడా లేనట్లున్నాడు.

అతడిని చూడగానే సత్యారావు కోపం వచ్చింది .

"వెళ్ళు వెళ్ళు ఇక్కడ కూర్చోకు" అంటుండగానే, సత్యారావును సాగనంపను, బయటికి వచ్చిన సీతమ్మ, అతడిని చూసి బయటికి వచ్చి దగ్గరగా వెళ్ళింది.

సీతమ్మను చూసి ఆ వ్యక్తి మరలా నోటిని, పొట్టనూ చూపాడు. అతడు బాగా ఆకలిగా ఉన్నాడని ఆమె గుర్తించింది. ఆడవారికి జాలి కరుణా ఎక్కువ.

"ఏమండీ! పాపం నీరసించి ఉన్నాడు. పైగా వయస్సై పోయిన వాడు. ఇతన్ని చూస్తుంటే మా నాన్నగారు గుర్తు వస్తున్నారు. లోపలికి రాను సాయం చేయండి. కాస్త భోజనం పెడదాము. "అంది.

"ఛ నోర్ముయ్ ! ముక్కూ మొహమూ తెలీని వాడిని ఇంట్లోకి తీసు కెళ్ళాలా? నీకేమన్నా పిచ్చాఏం? "

"మీరు వెళ్ళి సేవచేసే వారి ముక్కూ మొహం మీకుతెలుసా! అవసరం లో ఉన్నవారిని ఆదుకోడమే సేవ కానీ, అంతా చూస్తూ ఉండగా గొప్పగా ఒక చొక్కా ఇచ్చి ఫోటోలు దిగి పేపర్లలో వేసుకుని చూసుకోడం కాదండీ సేవంటే. మీరు వెళ్ళండి. నేను మాత్రం ఇతడి ని లోపలికి తీసుకెళ్ళి ఇంత భోజనం పెడతాను. ఇతడిని ఇలా వది లేసి ఊరుకోను" అంది కాస్త కోపంగా, ఖచ్చిత స్వరంతో.

"నీకీమధ్య చాలా కరుణ జాలీ పెరిగిపోడమేకాక నా మాటకు ఎదురు చెప్తున్నావు."

"మీ మాటకు కాదు మీ మనస్సులో ఉండే భావన మార్చుకో మంటున్నాను. మీరు అక్కడికి వెళ్ళి సేవ చేస్తుంటే ఇంటిముందున్న మనిషికి, అవసరంలో ఉన్నవానికి సాయం చేస్తానంటున్నాను" అంది పట్టుదలగా.

"ఏం చేస్తాం. మొండి భార్యతో, వేగలేక చస్తున్నాను. అతడేమన్నా చేసి ఇంట్లో ఉన్నది పట్టుకెళితే ఏం చేస్తావు? "

"ఇతడిని చూస్తుంటే మీకలా అనిపిస్తున్నదే మో కానీ నాకు మాత్రం పాపం ప్రాణం కడగట్టి ఉన్న ఈ గొప్ప వ్యక్తిలా కనిపిస్తు ఇతనికి తప్పక సాయంచేస్తాను.. మీరు వెళ్ళండి మీసేవకు, నేను నా సేవ చేసు కుంటాను" అంటూ. "సుబ్బులూ ఒకమారు ఇలారా! ఇక్కడ ఒక పెద్దాయన ఉన్నాడు. సాయం పట్టు లోపలికి తీసు కొద్దాం" అని సీతమ్మ ఇంట్లో పనిచేసే ఆమెను పిలిచి ఆయన్ను పట్టుకుని లోపలి కి తీసు కెళ్ళింది.

గొణుక్కుంటూ వెళ్ళాడు సత్యారావు తన పనిమీద.

సీతమ్మ సుబ్బులు సాయంతో అతడిని లోనికి తెచ్చి వసారాలో కూర్చోబెట్టి ముందుగా ఒక గ్లాసుడు పాలు ఇచ్చింది.

అతడు ఆపాలు త్రాగి గోడ ఆనుకుని కూర్చుని చేయెత్తి దీవించాడు.

"నాయనగారూ! మీరు ఓపికతెచ్చుకుని స్నానం చేయండి కాస్త భోజనం చేద్దురుగాని. స్నానం చేస్తే ఓపిక వస్తుంది, పైగా మీ బట్టలవీ బాగా మురిగ్గా కూడా ఉన్నాయి" అని వరండాలో ఉన్న ఒక గదిలోకి తీసు కెళ్ళి అక్కడున్న అటాచ్డ్ బాతు రూం చూపి, ఒక టవలూ, పంచె, చొక్కా అక్కడ పెట్టింది సీతమ్మ.

"ట్యాప్ తిప్పితే వేడినీరు వస్తుంది నాయనగారూ! సబ్బు కూడా అక్కడే ఉంది" అని చెప్పి తలుపు వారగా వేసి బయటికొచ్చి, అతడు స్నానంచేసి వచ్చేలోగా ఒక ప్లేట్లో అన్నం, పప్పూ, గోంగూరపచ్చడీ, నెయ్యీ, చారూ, పెరుగూ గిన్నెల్లో తెచ్చి ఆ గదిలో ఉన్న టేబులు మీద పెట్టింది.

అతడు స్నానంచేసి సీతమ్మ ఇచ్చిన బట్టలు వేసుకుని, బయటికి వచ్చాక "నాయనగారూ! ముందు భోజనం చేసి విశ్రాంతి తీసుకోండి. తర్వాత అన్నీ మాట్లాడుకోవచ్చు" అని భోజనం పెట్టింది.

అతడు మౌనంగా ఆమె పెట్టింది తిని, ఆమె చూపిన మంచంమీద పడుకుని నిద్రపోయాడు.

సీతమ్మ తనపనులన్నీ పూర్తి చేసుకుని సత్యారావు కోసం ఎదురు సూస్తూ కూర్చుంది.

సత్యారావు వచ్చి "ఎంత మందికి బట్టలూ బియ్యమూ ఇచ్చావో తెలుసా! ఎంతోమంది పేపర్లవారూ, టీవీ వారూ వచ్చి ఫోటోలు తీసు కున్నారు. రేపటి పేపర్లో వస్తుంది. టీవీ న్యూస్ రాత్రికి వేస్తారు. చూడు" అన్నాడు భోజనం చేస్తూ.

"అన్నట్లు ఆ ముసలాడిని ఏంచేశావు?" అని అడిగాడు.

"అతడు మామూలు వ్యక్తిలా లేడు. చాలా గౌరవ కుటుంబానికి చెందిన వానిలా చాలా మర్యాదగా ఉన్నాడు. స్నానం చేయమని భోజనం పెట్టి వరండా గదిలో పడుకోమని చెప్పాను" అని సీతమ్మ చెప్ప గానే,

"లోపలికెలా రానిచ్చావే! ఏమైనా ఐతే" అని సత్యారావు అంటుండగా "ఏమవుతుంది. మీరేమీ భయపడ కండి. అంతా మోసకారివారు కారు. మీ ఇల్లేం అరిగి పోదు. ఆవిషయం గురించీ మరి మాట్లాడకండి. ఆ గది వేరుగా ఉందికదా!" అని ఖచ్చితంగా చెప్పింది సీతమ్మ.

మధ్యమధ్యలో సత్యారావు గొణుగుతున్నా సీతమ్మ పట్టించు కోలేదు.

ఒక వారం పాటు, సీతమ్మ అతడిని కన్న తండ్రిలా మూడు పూట లా భోజన సౌకర్యం, స్నాన పానాదులూ చూసుకుంది.

కాస్త ఓపిక రాగానే అతడు ఒక రోజున సీతమ్మను పిలిచి , "అమ్మాయీ! నాకు గతం అంతా కొద్దిగా గుర్తుకు వస్తున్నది. మరికొన్ని రోజుల య్యాక కానీ అంతా గుర్తురాదు. నీకు శ్రమ ఇస్తున్నాను. నా బిడ్డలా నాకు సేవచేస్తున్నావు. నీ ఋణం ఉంచుకోను" అని చెప్పాడు. మరోవారమైంది.

"ఎన్నాళ్ళు ఇతడిని పోషిస్తావే! నీకు మతిగానీ పోతున్నదా ఏం!" అని కోప్పడ్డాడు సత్యారావు.

"మీరు సేవ అంటూ ప్రదర్శన చేసి పేపర్లలో ఫోటోలు వేయించు కుని సంతోషించగాలేంది, నాకు నచ్చిన పని నేను చేస్తే తప్పేంటీ! దీనివల్ల మీకేమీ నష్టం కలిగించను. ఈ పండుక్కి, నా పుట్టినరోజుకూ మీరు కొనే చీరలు నాకు అవసరం లేదు. ఆసొమ్ము ఇలా

ఖర్చు చేసుకుంటాను. సరా! నా పనికి మాత్రం అడ్డురాకండి. ఆపెద్దాయన ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. మరో రెండుమూడు రోజుల్లో గతం గుర్తుకు వచ్చి తన ఊరికి వెళ్ళిపోతాడు. అంతవరకూ నా పని మానను" అని చెప్పింది.

ఆరోజు ఉదయాన్నే ఆపెద్దాయన, టిఫిన్ ప్లేటు తీసు కెళ్ళి ఇచ్చిన సీతమ్మతో,"అమ్మాయ్! నేను కాశీ యాత్ర కని ఒంటరిగా వద్దని మావాళ్ళు అంటున్నాకూడా బయల్దేరి, యాత్ర అయ్యాక తిరుగు ప్రయాణం లో అలసిపోయి రైల్లో ఆదమరచి నిద్రపోయాను. ఎవరో నాబ్యాగు, పర్స్ తో సహా ఉన్నది కాజేశారు. పదిహేను రోజులు తిండి లేక నీళ్ళతో కొద్దిగా జేబులో ఉన్న సొమ్ముతో పళ్ళు తింటూ గడిపాను. నీవు పెట్టిన భోజనమూ నీ సేవ వలన నాకు కొద్దికొద్దిగా అన్నీ గుర్తు వస్తున్నాయి తల్లీ! మా ఇంటి ఫోన్ నెంబరు కూడా గుర్తువస్తున్నది. ఒకమారు ఫోన్ చేసుకోనిస్తావా!" అని అడిగాడు.

సీతమ్మ ఫోన్ చేసి ఇచ్చాక ఆ పెద్దయన మాట్లాడాడు. సీతమ్మ ఇంటి చిరునామా అడిగి చెప్పాడు.

ఆమరునాడు ఉదయాన్నే సత్యారావు ఇంటిముందు విమానమంత పెద్ద కారు వచ్చి ఆగింది.

సత్యారావు ఆశ్చర్యంతో చూస్తుండగా ఆకారు లోంచీ కొందరు వ్యక్తులు దిగి "అయ్యా! నమస్కారం! మా పెద్ద దొరగారు ఇచ్చిన ఈ ఇంటి చిరునామా ప్రకారం వచ్చాము. ఇక్కడ మా దొరగారు ఉండాలి, పిలుస్తారా!" అన్నారు.

ఇంతలో సీతమ్మ బయటికి వచ్చి, "అయ్యా! ఉండండి పెద్దాయన్ను పిలుస్తాను" అని ఆపెద్దాయనకు చెప్పగానే ఆయన బయటికి వచ్చారు.

అంతా ఆయన కాళ్ళకు మొక్కి "దొరా! మీకోసం అంతా వెతికాం. మీ వెంట ఎవ్వరినీ రానీక పోతిరి. పోలీస్ రిపోర్ట్ కూడా ఇచ్చాం. ఏమై పోయారాని బాధ పడుతూ కొందరిని కాశీకూడా పంపాం, మీ ఫోటోలు ఇచ్చి. కులాసాగా ఉన్నారు అంతేచాలు" అని ఆయన పాదాల చెంత కూర్చునున్నవారిని చూసి,

"పిచ్చివాళ్ళు మీరు, భయమెందుకూ! ఆపరమాత్మ చూసుకుంటాడు కదా! 15 రోజులు ఏమీ తినకపోటాన అన్నీ మరచి పోయాను. ఆహారమనే పదార్థం చేత- మనస్సు, నీటి చేత-ప్రాణం, అగ్ని చేత -వాక్కు ఏర్పడతాయని పూర్వం ఉద్దాలకుడు అనే ఋషి తన కుమారుడైన శ్వేతాకేతువుకు ప్రయోగపూర్వకంగా నిరూపించాడు. ప్రస్తుతం నాస్థితీ అంతే ఐంది. రెండు వారాలపాటు భుజించాక కానీ నాకు అన్నీ గుర్తుకు రాలేదు. ఈ బంగారు తల్లి నాకు భోజనం పెట్టి సహాయంచేసి ఆదుకుంది" అని సీతమ్మను చూపి,

"అమ్మా మీరు ఇరువురూ నాతో రండి. మా ఇంటికి ఒక వారంపాటు ఉండి వద్దురు గాని" అని బలవంతాన వారిద్దరినీ తనకార్లో ఎక్కించు కుని వెళ్ళాడా పెద్దాయన.

ఆయన ఇల్లు చూసి సత్యారావు ఆశ్చర్యపోయాడు. అది ఏడంతస్తు ల మేడ, దాని అందం, చుట్టూ పెద్ద అందమైనతోట. కార్లూ, ఖరీదైన ఫర్నిచర్! ఈయన ఇంత గొప్ప ధనికుడా అనుకున్నాడు సత్యారావు. ఆయన ఇంటి చుట్టూ ఉన్న సుమారుగా 200 ఇళ్ళు, పక్కనే పెద్ద బొమ్మలు తయారు చేసే ఫ్యాక్టరీ, అక్కడ పనిచేసే వారికంతా ఇళ్ళు కట్టించి ఇచ్చి, పని ఇచ్చి, వారి బిడ్డలకంతా చదువుచెప్పిస్తూ ఆదుకుని కాపాడుతున్న ఆ పెద్దాయన గొప్పతనం చూసి తన ప్రవర్తనకు సిగ్గుపడ్డాడు సత్యారావు.

ఆపెద్దాయన సీతమ్మకు, మంచి కంచిపట్టుచీర, ఆమె ఎంతవద్దంటున్నా పాతికవేల రూపాయలు, 'తండ్రి ఇచ్చే కానుకగా తీసుకో మని' బలవంతపెట్టి ఇచ్చి, సత్యారావుకు పట్టుబట్టలూ పెట్టి గౌరవంగా ప్రేమగా సాగనంపాడు తన కార్లో ఇంటికి."

ఇదిరా మనవడా ఇప్పుడు నీకు సాయం అంటే ఏదో, సేవ అంటే ఏదో అర్థమై ఉంటుందనుకుంటాను " అని ముగించారు తాతగారు.

"అబ్బా! చాలారోజులకు మంచి పెద్ద కథ చెప్పావు తాతా థాంక్స్ " అని పరుగు తీసాడు మనవడుమాధవ్.

***

# ప్రేమంటే ఇంతే



ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

(గతసంచికతరువాయి)

అందుకే గత కొంత కాలం నుండి నిన్ను చూస్తూవుంటే నాకు ఆందోళనతో నిద్ర పట్టడం లేదు, అందుకే నీ జీవితంలో మంచి రోజులు చూడాలని ఆశించి చేసిన ప్రయత్నమే ఇది. ఈ విషయంలో మామయ్యగారు, అత్తయ్యగారు నాకు ప్రోత్సాహాన్ని, సహకారాన్ని ఇచ్చారు. నా ఆశ సఫలం కావడానికి మహేంద్రే కారణం” అని మహేంద్ర వైపు తిరిగి “థాంక్యూ మహేంద్రా” అన్నాడు.

ఇంట్లో అడుగు పెడుతుండగానే అమ్మ ఎదురొచ్చి "ఏరా అమ్మాయి ఎలా వుంది, నీకు నచ్చిందా" అని చాలా ఆతృతగా అడిగింది.

"తగునీ చక్రి విధర్భ రాజ సుతకున్ తథ్యంబు"...భాగవతంలో రుక్మిణీ కల్యాణం ఘట్టములో పద్యం పాడి "సీతమ్మా నువ్వేమీ కంగారు పడకే, వాళ్ళిద్దరూ ఆల్‌రడీ మాట్లాడుకున్నారు, మనం అక్షింతలు వేయడమే, అంతే" అని నాన్నగారు నన్ను వేళాకోళం చేసారు. తరువాత తెలిసింది అవినాశ్ కాకినాడలో మేము బయలుదేరే ముందే నాన్నగారికి అన్ని విషయాలు చెప్పాడని.

మా అమ్మ సంతోషానికి అవధులు లేవు "వెర్రి నాగన్న సంవత్సరం బట్టి ఒకటే ఆవేదనలో నలిగి పోయాడు, ఆ వెంకన్న బాబు దయవలన మంచి రోజులు వచ్చాయి, స్వామీ వాడి పెళ్ళి అయిన తరువాత కొడుకు, కోడలుని తీసుకొని నీ కొండకు వస్తాము" అని మ్రొక్కుకుంది.

ఆ తరువాత రుక్మిణి నాన్నగారు మా గురించి వాకబు చేయగా సత్యనారాయణకి బావమరిదినే అని తెలిసి బావగారి ద్వారా కబురు పెట్టి విశాఖ వచ్చారు, అక్కా వాళ్ళింట్లోనే పెద్దవాళ్ళ కోసం పెళ్ళిచూపులు జరిగాయి. అక్కా బావగారు మనిద్దరి విషయంలో ఎంత చిత్తశుద్ధితో ప్రయత్నించారో అంతే చిత్తశుద్ధితో ఇప్పుడూ ప్రయత్నించారు...పెళ్ళి నిశ్చయమైన తరువాత "ఆ చెల్లి విషయంలో తప్పించుకున్నావు గాని, ఈ చెల్లి విషయంలో నిన్ను బంధించాను" అని బావగారు నన్ను వేళాకోళం చేసారు...అదీ కథ అని ముగించాడు కృష్ణమోహన్.

“అబ్బో ‘రుక్మిణీ కళ్యాణం’ చాలా ఆసక్తికరంగా జరిగింది, మొత్తానికి నీ కోనసీమ లక్ష్యాన్ని సాధించావు. రుక్మిణి చాలా తెలివైనది, మన విషయం మొత్తము నీ నుంచి రాబట్టింది” నవ్వుతూ అంది అనూరాధ.

“అవును”

“రాధా కొన్ని అన్నమాచార్య కీర్తనలు, త్యాగరాజ కీర్తనలు పాడవా? నీ సంగీతాన్ని విని 23 ఏళ్ళయింది"

“నిన్న రుక్మిణి పాడమని అడిగితే రేపు పాడుతానని చెప్పాను అందుకని ఇంటికి వెళ్ళాక పాడుతాను, తను కూడా వింటుంది”

“సరే ఒక సినిమా పాట పాడు”

“ఎవరో రావాలి నీ హృదయం

కదిలించాలి" అని కృష్ణమోహన్‌కి ఇష్టమైన పాట పాడింది.

"వండర్‌ఫుల్, నాలుగున్నర అయింది పద బీచ్ చూద్దుగాని మళ్ళీ చీకటి పడుతుంది" అన్నాడు కృష్ణమోహన్.

ఇద్దరూ కారు దిగి బీచ్‌లోకి వెళ్ళారు. ఆ నీళ్ళు చూసి అనూరాధ చిన్న పిల్లలాగ కేరింతలు కొడుతూ సముద్రంలోకి పరుగులు తీసింది. అది చూసి కృష్ణమోహన్ కంగారు పడి "రాధా జాగ్రత్త, దొంగ కెరటాలుంటాయి అవి చాలా ప్రమాదకరమైనవి, లోపలికి లాగేస్తాయి" అని వారించాడు.

"పరవాలేదు నువ్వున్నావుగా ములిగిపోతే కాపాడడానికి, బీచ్ చూసి ఎన్ని సంవత్సరాలయిందో" అంది అనూరాధ. కృష్ణమోహన్ కూడా ఆమె వెంట పరుగు తీసి అనూరాధని చేరుకున్నాడు.

కెరటం కాళ్ళని తాకి నీరు క్రిందనించి పోయినపుడు కాళ్ళ క్రింద ఇసుకని కోరేసినపుడు వచ్చే ఒక రకమైన వింత అనుభూతిని ఆస్వాదిస్తూ ఎంతో ఆనందపడుతున్నాది అనూరాధ. ఆ సమయంలో ఆమె తూలిపడకుండా ఆమెని ఒడిసి పట్టుకున్నాడు కృష్ణమోహన్. అనూరాధ అలా ఆ నీళ్ళలో కాస్సేపు గడిపి తన ఆవేదనలని, కలతలని, ఈ ప్రపంచాన్ని మరచిపోయి ఆనందించింది. ఆమె ఆనందాన్ని చూసి కృష్ణమోహన్‌కి ఎంతో ఉపశమనం కలిగింది. అరగంట తరువాత కృష్ణమోహన్ బలవంతాన అనూరాధని ఒడ్డుకి తీసుకొని వచ్చాడు. ఒడ్డున కూర్చున్నాక ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ముంత కింద పప్పు తిన్నారు. "ఐదున్నర అయింది, చీకటి పడుతోంది ఇక లేద్దామా?" అన్నాడు కృష్ణమోహన్.

ఇద్దరూ ఇసుకలో నడుస్తున్నారు..."నువ్వు అడిగిన అపాయింట్‌మెంట్ ఇచ్చానా? నీకు సంతోషంగా వుందా" అని అడిగాడు కృష్ణమోహన్.

"థాంక్యూ. నాకు చాలా ఆనందంగా వుంది. జీవితం మీద ఆశ పోయి చాలా రోజులయింది, కానీ ఈ రోజు తరువాత జీవితం మీద ఆశ మళ్ళీ చిగురించింది" అంది అనూరాధ.

కాస్త ముందుకి వచ్చేసరికి అక్కడ ఒక టీ దుకాణం కనబడితే "లంచ్ తరువాత ఏమీ తాగలేదు, కాఫీ తాగుదాము పద" అని "బాబూ రెండు కాఫీ ఇయ్యి" అని దుకాణదారుడితో అన్నాడు.

"సార్ కాఫీ లేదు, టీ వుంది" అన్నాడు ఆ దుకాణదారుడు.

"సరే ఇయ్యి" అని ఇద్దరూ అక్కడ బల్లమీద కూర్చున్నారు. కృష్ణమోహన్ దృష్టి అక్కడకి దగ్గరలో కూర్చున్న ఒక జంట మీద పడింది. వారిద్దరికి పాతిక సంవత్సరాల వరకు వయసు వుంటుంది. ఆ అమ్మాయి ఏడుస్తూ వుంటే ఆ అబ్బాయి ఓదారుస్తున్నాడు. కృష్ణమోహన్ టీ తాగుతూ వారినే గమనిస్తున్నాడు. ఇంతలో ఒక నలుగురు అబ్బాయిలు ఆ జంట వద్దకు వచ్చి ఏదో అన్నారు. ఆ అమ్మాయి ఆ అబ్బాయిని భయంతో గట్టిగా పట్టుకుంది, అతను ఆ నలుగురితో ఏదో ఘర్షణ పడుతున్నట్లు కృష్ణమోహన్‌కి అర్థమయింది.

అనూరాధతో విషయం చెప్పి "నువ్విక్కడే వుండు, వాళ్ళకి బుద్ధి చెప్పి వస్తాను" అన్నాడు.

"కృష్ణా నువ్వు వెళ్ళద్దు, ఎందుకు మనకి అనవసరమైన విషయాలు, వాళ్ళు నలుగురున్నారు నీకు హాని తలపెట్టవచ్చు"

"కంగారు పడకు ఏమీ అవదు" అని వాళ్ళ దగ్గరకు బయలుదేరాడు కృష్ణమోహన్. అతని వెనకే అనూరాధ కూడా వెళ్ళింది.

(ఇంకా వుంది)

# మా ఊరి నందుల ఆత్మీయ కథ

## నందుల ప్రభాకర శాస్త్రి



....అరవై నిండిన అయ్యపు రెడ్డి సారు ఆర్ద్రమైన కన్నులతో.. గద్గద కంఠంతో చెప్పటం నాకిప్పటికీ గుర్తు.

మా పెద్దమ్మాయి అనూరాధకు అప్పుడప్పుడే పెళ్లి పెత్తనాలు చూస్తున్నాం. అమ్మ బాగా మెత్తబడింది. ఆయాసం ఎక్కువవుతూ ఉంది. మా మనసులోని సందిగ్ధాన్ని గమనించి.. ప్రభూ, అనక్కయ్య పెళ్లి అయినంత వరకూ మిమ్మల్ని ఇబ్బంది పెట్టను.పెళ్లి నిర్విఘ్నంగా సాగుతుంది. ముహూర్తాలు పెట్టుకోండి. నేను కళ్లారా చూస్తాను. ఇంకా ఆరు నెలల సమయముంది నాకు" అంది. అన్నట్లుగానే ఆరు నెలల వరకు వేచి చూచింది.

అమ్మ కేవలం ఇంటి లోపలే తిరగగలుగుతోంది. ఆహారం పూర్తిగా తగ్గిపోయింది. బాగా ఆయాసపడుతోంది. తమ్ముడు రవీంద్ర శర్మ ఇంట్లో వుంటోంది. నేను జూనియర్ కాలేజీ అడ్మిషన్స్ విషయమై తీవ్రంగా తిరుగుతున్నా... రోజూ ఓ పది నిముషాలు అమ్మ దగ్గర కూర్చుని మాట్లాడుతున్నా. ఒక రోజు మాటల్లో మా నాన్నగారి 'తిథి'(తద్దినం) గురించి మాట్లాడింది.

చైత్ర బహుళ నవమి, సోమవారం నాన్నగారి తిథి, గిద్దలూరులో, మన ఇంట్లోనే పెట్టాలనుకున్నాం. అమ్మ ప్రయాణం చేసే స్థితిలో లేదు కాబట్టి వారం రోజుల ముందే అందరికీ తెలపమంది. అమ్మ చెప్పిన వెంటనే అన్నతో, అందరితో మాట్లాడాడు రవీంద్ర శర్మ. రవీంద్ర శర్మ బాడిగ ఇంట్లో ఉంటున్నాడు, భార్యా ఇద్దరు కొడుకులతో. పెద్దవాడికి 'సుబ్బరామయ్య' అని మా నాన్న పేరు పెట్టుకుంది. అయితే అమ్మను మా ఇంటికి తీసుకురావాలని ఇంట్లో ప్రతిపాదించాను. 'పెండ్లిమాటలు జరిగి మూడు నెలలు కాలేదు, నాంది జరిగిన ఇల్లు,





అశుభం జరుగకూడదు అంటూ చాలామంది సాకులు చెప్పారు.

నాన్న చనిపోయేనాటికి సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లోనే చనిపోయారు. కనీసం అమ్మనైనా నేను స్వయంగా కష్టపడి, ఇటుక ఇటుకను కష్టపడి సంపాదించి కట్టుకున్న ఇంట్లో ఉంచాలని నా ఆశ. అయితే .... మా కుటుంబంపై మొదటినుంచి బంధువుల ఆధిపత్యం ఎక్కువ. నాలుగు రోజులు తర్జన భర్జనలు, తిరస్కారాలు అయినా తరువాత ఎవరినీ లెక్క చేయకుండా అమ్మను రిక్షాలో కూర్చోపెట్టుకుని ఇంటి దగ్గరికి తెచ్చా.

"ఎవరి ఇల్లు ఇది, ప్రభు ఇల్లేనా?" అని అడిగింది. వారం రోజులకే నాన్నగారి తిథి. ఆరోజు వరకు అలాగే కొంచెం కొంచెం తింటూ... మండుటెండల్లో ప్రాణాలు ఉగ్గపట్టుకుంది. తద్దినం ముందురోజు రాత్రే అందరూ వచ్చారు. అందరిని చుట్టూ కూర్చోపెట్టుకుని పేరుపేరునా పలకరించి తలా నిమిరి మాట్లాడింది.

ఉదయాన్నే లేచి వద్దంటున్నా వినకుండా తలస్నానం చేసి మడుగు చీర కట్టుకుని కూర్చుంది. చైత్ర బహుళ నవమి, సోమవారం నాన్నగారి 'తిథి' ప్రారంభం అయింది. అమ్మ దగ్గర ఒకరిద్దరు కనిపెట్టుకుని వున్నారు. బ్రాహ్మలు భోజనాలు అయ్యి, పారణాలు తయారు చేసి, నైవేద్యం పెట్టి, అందరూ దండాలు పెట్టుకున్నారు. అమ్మ ఇంటినుంచే 'నమస్కారం' చేసుకుంది. ఆ తరువాత, 'అందరూ భోజనాలు చేశారా?" అని అడిగింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ప్రసాదం అడిగి నోట్లో వేసుకుంది. అందరూ అమ్మ చుట్టూనే వున్నారు. వళ్ళు కాలిపోతూ వుంది. 'మంటలుగా వుంది' అంది. రాఘవయ్య మామ, రామచంద్రమూర్తి వచ్చి చూశారు. కిడ్నీతో సహా అన్నీ పనిచేయటం మానేశాయన్నారు.

వేడి తట్టుకోలేకపోతున్నా..కూలర్ దించమని అడిగింది. మిద్దెపై నుండి కూలర్ దించి తల వైపున పెట్టాను. అందరివైపు ఒక్కసారి చూసి, తలా వైపున నున్న నన్ను చూడ్డానికి వెనక్కు తలా వేలాడదీసింది.... అంతే చూపు ఆగిపోయింది. కళ్ళు అలాగే ఉండిపోయాయి. అదే మహాయోగిని చూపు... చివరిచూపు దాకా.

(ఇంకా వుంది)

# శ్రీ వచన భూషణం

శ్రీవేంకటాచార్యులు



(గత సంచిక తరువాయి)

## 2. యిడక్కవతు స్మృతిచే వేదం యొక్క పూర్వభాగమందలి అర్ధమును , మిగిలిన రెండింటినీ ఉత్తర భాగము యొక్కఅర్ధముగా నిర్ణయిం చుట జరిగినది.

వేదములోని మంత్ర సంహిత, బ్రాహ్మణములను వేదముల-యొక్క పూర్వభాగముగా తెలి-యజేస్తూ ఈ భాగాన్ని కర్మకాండ అని, మిగిలిన అరణ్యకము, ఉపనిషత్తులని ఉత్తరభాగము-గా విభజించి వీటిని జ్ఞానకాండ గాను నిర్ణయించుట జరిగినది.

వేదము లోని పూర్వభాగ మందలి కర్మకాండ యొక్క పూర్తి వివరణ స్మృతులు (ధర్మశాస్త్రము-లు ), ఉత్తర భాగమైన జ్ఞానకాం-డము ఇతిహాస పురాణములు వివరిస్తున్నాయి

**ఇతిహాస పురనాభ్యాం వేదాంతార్ధః ప్రకాశ్యతే**

ఇతిహాస పురాణములు వేదార్ధ-ములను ప్రకశింపజేస్తునాయి.

ఇతిహాసములు అనగా గడచిన చరిత్ర ఉన్నది ఉన్న-ట్లు చెప్పే ఆధార గ్రంధం. ఉదా :-రామాయణం, మహాభారతం. ఈ రెండు గ్రంధములు వేదము-నకు పూర్తి వివరణ గ్రంధాలుగా ప్రకాశిస్తునాయి.

పురాణములు అనగా వేదసా-రాన్ని చిన్న చిన్న కధల రూపంలో అందించే గ్రంధము. కధల రూపములో ఉండే ప్రతీ గ్రం-ధాన్ని 'పురాణము' గా గుర్తించ-రు. పురాణము అనగా వర్గము (సృష్టి), ప్రతి వర్గము (ప్రళయ-ము), వంశము (పృధు, ప్రియవ్ర-తాదుల వంశోత్పతి), మానమం-తరము (ఏ కల్పము, ఏ మనువు కాలంలో జరిగింది), వంశముల చరిత్ర (సూర్యచంద్రాది వంశస్తుల చరిత్ర) అనే ఐదు లక్షణాలు కలిగి ఉండాలి. ఇవిగాక వృత్తి (వ్యాపా-రము ), రక్షా (పరిపాలన ),సంస్థ (స్తితి), హేతువు (కారణము), అపాశ్రయము (ఆశ్రయ విష-యములు ) తో కలిపి పది లక్ష-ణాలు కలిగి ఉన్న దానిని 'మహా పురాణము' అన్నారు.

ఉదా :- భాగవతం

**ఇతిహాస పురాణాభ్యాం వేదం సముప బ్రుంహయేత్**

ఇతిహాస పురాణములు వేదా-ర్ధాములనే వివరిస్తాయి .

"మిత్ర సమ్మితం పురాణం"

పురాణములు స్నేహితునివలె మన కర్తవ్యాన్ని బోధిస్తూ మన అభివృద్ధికి సహకరిస్తాయి .

పురాణములు సత్వ, రజ, తమో గుణములను చక్కగా వివరించి అందు సత్కర్మలు కలిగించే గుణాన్ని గ్రహించి ఆచరించమని హితబోధ చేస్తాయి .

ఈ విదముగా ఇతిహాస , పురాణ-ములు రెండూ వేదసారమును ప్రకాశింపజేసే గ్రందములుగా గుర్తింపు పొందాయి .

# అనుపానము

పి ఆర్ శాస్త్రి



చికిత్సా సమయములో మందుతో పాటుగా చాలా ప్ర- ధానమైనది అనుపానము. ఈ పానము మందు శరీరములో ప్రవేశించినపుడు అది శరీర జీ- ర్ణక్రియలో భాగమై అవసరమ- గు రసాయనాలతో సమ్మిళితమై ఆరోగ్యమునిచ్చును.

ఈ రోజులలో దీనికి అంత ప్రా- ధాన్యము తగ్గినది. ప్రపంచగతి అతి వేగముగా నడచుచున్నది. ఆహార నియమములు, నిద్రా సమయము, వ్యాయామములు చేయలేకపోవుట... ఇలా మన జీవనశైలిలోని మార్పు వల్ల ఆరో- గ్యానికి ఇవ్వవలసిన సమయం ఇవ్వలేక అనారోగ్యాల పాలుప- డుతున్నాము.

ఆహార నియమములు, సమ- యపాలన, మనస్సును ప్రశాంత- ముగా నుంచుకొనుట, వ్యాయా- మము, నిద్ర లేక సరైన విశ్రాంతి మన దినచర్యలో భాగంగా క్రమశిక్షణతో కూడిన జీవన శైలిని అలవర్చుకోవడం చాలా అవసరం.

అనారోగ్యాలు కొన్ని వంశ పారం- పర్యంగా వచ్చేవి వచ్చే అవకాశ- ములు హెచ్చుగానే ఉండును. ఇక కొన్ని ఆగంతక రోగములు, చెప్పకుండా వచ్చేవి అనగా యా- క్సిడెంట్లు, పాము కాటు, కుక్క కాటు, అంటు వ్యాధులు, కొన్ని పొరపాట్ల వల్ల వచ్చే వ్యాధులు - వీటి చికిత్సలో భాగంగా మందులతో పాటు ఈ అనుపా- నముల వలన తృప్తిని, శరీర- మండలి ఇంద్రియములకు పుష్టి నిచ్చును. తీసుకున్న మందుని ఆమాశయంలోకి, పక్వాశయం- లోకి అనగా లివర్, స్ప్లీన్ చేర్చి బలమును, జీవమును ఇచ్చి భుజించిన ఆహారమును శరీ- రంలోని అన్ని భాగాలకు చేర్చి అన్నసాంద్రత తగ్గించి, కోమల- త్వాన్ని ఉత్పన్నం చేస్తుంది. అం- దువల్ల అనుపానం సర్వ శ్రేష్ఠమ- యినది.

అనారోగ్యము వచ్చినపుడు డాక్ట- రుగారు చెప్పినట్లు సమయమై- నాకు ఆ మందులు తినేముందు, తిన్న తరువాత వేడి నీళ్లతో, పాలతో, తేనెతో, ఏదైనా రసంతో, పసరుతో ఆ మందును లోపలి తీసుకోమని చెప్పేవాటినే అను- పానమంటారు.


ఆయుర్వేదంలో కొన్ని రోగలక్షణ- ములను బట్టి కొన్ని మందులకు అనుపానముగా బియ్యము కడిగిన పైనీళ్ళు, పెరుగుపై తేలిన నీళ్లు, పలుచని మజ్జిగ, మరి కొన్ని మందులు రాలి ఆకులో తేనె కలిపి వేసుకున్నందువల్ల, ఆకు ప్రభావము వల్ల ఆ మందు ప్ర- భావము రెట్టింపు శక్తిని ఇచ్చి రోగ ప్రభావమును తగ్గించి ఫలితము త్వరగా ఇచ్చును.

కొన్ని అనుపానములు వారి వారి శరీర స్థితిని బట్టి నిర్ధారించుదు- రు. అనగా కొన్ని కషాయములు, వాము కషాయము, ధనియాలు, జీలకర్ర వేడినీటిలో బాగుగా మరిగించి, తేనె కలిపి, కొన్ని- సార్లు అల్లం రసం కలిపి అను- పానములు మందుతో పాటుగా సేవించమని చెప్పుతారు. ఈ అనుపానము, మందు ఎంత ముఖ్యమో అంత శ్రేష్టము అని గ్రహించగలరు.

డా|| పి ఆర్ శాస్త్రి
9949938691

# ఈ నెల కార్టూన్

- సరసి




## గ్రీసు దేశపు పురాణ గాథలు

(23 వ పేజీ తరువాయి)

(https://www.youtube.com/watch?v=r_lilQSdJDY) ఇదే రకం మానసిక సంక్షోభం ఆడపిల్లలు తమ తండ్రి యెడల, మగ గురువుల యెడల కూడ చూపిస్తూ ఉంటారు అంటారు ఫ్రాయిడ్. అప్పుడు దానిని "ఎలక్ట్రా కాంప్లెక్స్" (Electra Complex) అంటారు.

(Oedipus complex, is a term used by Sigmund Freud in his theory of psychosexual stages of development to describe a child's feelings of desire for his or her opposite-sex parent and jealousy and anger toward his or her same-sex parent.

The Electra complex is a psychoanalytic term used to describe a girl's sense of competition with her mother for the affections of her father. It is comparable to the male Oedipus complex.)


కాశీలో గంగా స్నానం చేస్తున్న ప్రధాని


80 సంవత్సరాల నేపథ్య గానం -
లతా మంగేష్కర్

RNI No. TELTEL/2011/39497 DECEMBER 2021 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st December Date of Posting:8th December



# కొత్త సొగసులతో కాశీ విశ్వనాథుని మందిరం

Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.